ఈనాడు
అమరావతి
గుంటూరు
మంగళవారం అక్టోబరు 22, 2024

రైతులను మోసం చేయాలని చూస్తే సహించం

- నష్టపోయిన కర్షకులకు పరిహారం పంపిణీ
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతులను ఎవరు మోసం చేసినా సహించేది లేదని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హెచ్చరించారు. ఇటీవల రాఘవేంద్ర, తియ్యగూర గోదాముల లీజుదారుడి మోసంతో నష్టపోయిన రైతులకు పరిహారంగా రూ.1.60 కోట్లు గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో సోమవారం పంపిణీ చేశారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ 'రాష్ట్ర వ్యాప్తంగా కూడా గుంటూరు మిర్చియార్డుకు సరకును తీసుకొస్తుంటారు. ఆశించిన ధర వస్తుందని ఇక్కడి శీతల గోదాముల్లో నిల్వ చేసుకుంటారు. వారి బలహీనతను అడ్డం పెట్టుకుని శీతల గోదాము నిర్వాహకుడు మిర్చి బస్తాలను అమ్ముకుని, నకిలీ పేర్లతో బ్యాంకు రుణాలు తీసుకున్నాడు. నష్టపోయిన రైతులు తన వద్దకు వచ్చినప్పుడు చాలా బాధేసింది. దీనిపై స్పందించి యంత్రాంగానికి సూచనలు చేశాం. దీంతో కలెక్టర్, ఎస్పీలు సదరు గోదామును సీజ్ చేసి, నిర్వాహకుడి ఆస్తులు అటాచ్ చేశారు. బాధ్యులు తప్పించుకునే మార్గాలన్నీ మూసేశాం. ఆ వ్యక్తి నుంచే రైతులకు డబ్బులు ఇప్పించేందుకు చర్యలు చేపట్టాం. లీజుదారుడు రూ.కోటి, గోదాము యజమాని రూ.60 లక్షలు ఇచ్చారు. రైతులను మోసం చేసి నష్టపరిస్తే.. వారు ఎక్కడున్నా సరే తీసుకొచ్చి మరీ రికవరీ చేస్తాం. రైతుల నుంచి కూడా కొన్ని మోసాలు ఎదురవుతున్నాయని తన దృష్టికి కొందరు తీసుకొచ్చారు. ఎవరు ఎవరిని మోసం చేసినా ధర్మం వైపు నిలబడతాం. ప్రస్తుత ఘటనలో నష్టపోయిన రైతులకు తక్కువ కాల వ్యవధిలోనే పరిహారం అందజేస్తున్నాం'.. అని పేర్కొన్నారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడారు. రైతులకు సత్వర న్యాయం చేసేందుకు కృషి చేసిన కలెక్టర్, ఎస్పీలను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని అభినందించారు. మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నష్టపోయిన రైతులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన ఎమ్మెల్యే రామాంజనేయులు, ఎస్పీ సతీష్‌కుమార్, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

రారండ్రో.. వేడుక పిలిచెన్


పున్నమిఘాట్ వద్ద రిహార్సల్స్




సీకే కన్వెన్షన్‌లో ముస్తాబైన వేదిక


డ్రోన్లతో గౌతమ బుద్ధుడు, విమానం ఆకృతులు



నేటి నుంచి డ్రోన్ సమ్మిట్-2024

ఈనాడు, అమరావతి, భవానీపురం, న్యూస్‌టుడే

అమరావతి రాజధానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కృష్ణా నదీతీరం వెంబడి పున్నమి, భవానీ ఘాట్‌ల వేదికగా డ్రోన్‌షో నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గతంలో ఎన్నడూ జరగని రీతిలో డ్రోన్‌షో నిర్వహించనున్నారు. కృష్ణానదిపై ఆకాశంలో ఒక్కసారిగా 5,500 డ్రోన్లు కనువిందు చేయనున్నాయి. డ్రోన్లతో ఆకాశంలో వివిధ రకాల బొమ్మలు, ఆకృతులు, పేర్లతో షో జరుగుతుంది. ఇప్పటికే నిర్వాహకులు ట్రయల్ రన్ పూర్తి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేయనున్నాయి. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.

ఘనంగా ఏర్పాట్లు.. నదీ తీరం వెంబడి డ్రోన్‌షోకు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో నదీతీరాన్ని పరిశుభ్రంగా ఉంచారు. ఘాట్‌కు వెళ్లే మార్గంలో పచ్చని మొక్కలు ఉంచారు. వీఐపీలు, అతిథులు, సాధారణ ప్రజలకు గ్యాలరీలు సిద్ధం చేశారు. సందర్శకులు కూర్చుని కార్యక్రమాన్ని తిలకించేలా గ్యాలరీల్లో కుర్చీలు వేశారు. ఘాట్ పొడవునా భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. విద్యుత్తు దీపాల వెలుగు జిలుగులతో నదీతీరం కోలాహలంగా మారింది. డ్రోన్‌షోతో పాటు లేజర్ లైట్ షో, మ్యూజిక్ బ్యాండ్, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. భవానీ ద్వీపం వద్ద నుంచి బాణసంచా భారీ ఎత్తున కాల్చనున్నారు.

ఆకట్టుకున్న ముందస్తు రిహార్సల్స్... డ్రోన్‌షో విజయవంతానికి నిర్వాహకుల ముందస్తు రిహార్సల్స్ ఆకట్టుకున్నాయి. ఆదివారం, సోమవారం రాత్రి సమయంలో నదీతీరం వెంబడి ట్రయల్ రన్ వేశారు. ఆకాశంలో ఒక్కసారిగా వివిధ రకాల ఆకారాలతో బొమ్మలు కనిపించడంతో నగర వాసులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. నదీతీర ప్రాంతం ఒక్కసారిగా వెలుగు జిలుగులతో నిండిపోవడంతో అలాగే చూస్తుండిపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు, మంత్రులు, అతిథులు వస్తున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం నుంచే వెయ్యి మందికి పైగా పోలీసులు బందోబస్తులో ఉన్నారు. వేదికపై అతిథుల ప్రసంగాలను వీక్షించేలా భారీ తెరలు సైతం అమర్చారు. వేలాది డ్రోన్‌లకు ఛార్జింగ్ పెట్టారు. అలాగే ఆకాశంలో వివిధ రకాల ఆకారాలు వచ్చేలా కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ఇచ్చారు.


సిద్ధమైన డ్రోన్లను పరిశీలిస్తున్న యువతి

ప్రతిష్ఠాత్మక ఏర్పాట్లు

మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ వేదికగా మంగళ, బుధవారాల్లో అమరావతి డ్రోన్ సమ్మిట్-2024ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. జాతీయ స్థాయి కార్యక్రమం కావడంతో భద్రతా చర్యలు తీసుకున్నారు. డ్రోన్ ఆవశ్యకత, భవిష్యత్తు అవసరాలు, ఆయా రంగాల్లో వినియోగంపై విస్తృత స్థాయిలో చర్చలు జరుగుతాయి. డ్రోన్ల తయారీదారులు వారి ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరు కానున్నారు. ఏర్పాట్లను గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ సంయుక్తంగా సోమవారం రాత్రి పరిశీలించారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ పొలిటికల్ సెక్రటరీ సురేష్‌కుమార్

సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన

నవంబరు 29 నాటికి ప్రక్రియ పూర్తి
జిల్లాల వారీగా కమిటీల ఎన్నిక

ఈనాడు, అమరావతి

నాగార్జునసాగర్ ప్రాజెక్టు, కృష్ణా పశ్చిమ డెల్టా కింద రైతుల భాగస్వామ్యంతో రైతుప్రతినిధులను ఎన్నుకోవడానికి సాగునీటి సంఘాలకు కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ప్రకటన ఇచ్చింది. సోమవారం జిల్లాల వారీగా ప్రకటనలు విడుదల కావడంతో ఓటర్ల జాబితా, ఎన్నికలు, ఎంపిక ప్రక్రియ మొత్తం నవంబరు 29నాటికి పూర్తి చేసేలా షెడ్యూల్ ప్రకటించింది. మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టుల కింద కాలువల ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉండటంతో సమర్థులైన రైతులను కమిటీ ఛైర్మన్లుగా ఎన్నుకునే వెసులుబాటు ఉంది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా వ్యవస్థను నిర్వీర్యం చేశారు. కాలువల నిర్వహణ, కనీస మరమ్మతుకు కూడా నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం సాగునీటి సంఘాలకు ఎన్నికల ప్రకటన ఇచ్చి కమిటీల ఎంపిక ప్రక్రియకు మార్గం సుగమం చేసింది.

రైతు ప్రతినిధులతో కమిటీలు

కాలువల కింద 6 నుంచి 12 మంది ప్రాదేశిక నియోజకవర్గాలు(టీసీ)గా గుర్తిస్తారు. ఇందులో భూమి కలిగిన ప్రతి ఆయకట్టుదారుడు ఓటరుగా ఉంటారు. అర్హులైన వారు రెవెన్యూ, జలవనరులశాఖ అధికారుల వద్ద ఓటరుగా నమోదు చేసుకోవాలి. ప్రాదేశిక నియోజకవర్గంలోని సభ్యులందరూ నీటివినియోగదారుల సంఘాన్ని(డబ్ల్యూఏ) ఎన్నుకుంటారు. డబ్ల్యూఏ ఛైర్మన్‌గా ఎన్నికైన వారు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఛైర్మన్లను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌లు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. సాగర్ కాలువల కింద లింగంగుంట్ల, ఒంగోలు సర్కిళ్లు ఉన్నాయి. రెండు సర్కిళ్లకు కలిపి ఒకే ప్రాజెక్టు కమిటీ ఉంటుంది. పల్నాడు జిల్లాలోని లింగంగుంట్ల సర్కిల్ పరిధిలోని వారే ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికవుతారు. ఒంగోలు సర్కిల్ పరిధిలోని ఒంగోలు జిల్లావారు ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికవుతారు. అదేవిధంగా కృష్ణాపశ్చిమ డెల్టా పరిధిలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఆయకట్టు ఉంది. రెండు జిల్లాల్లో డబ్ల్యూఏ, డీసీలను ఎన్నుకుంటారు. బాపట్ల జిల్లాలో ఆయకట్టు ఎక్కువగా ఉన్నందున ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పదవి ఆ జిల్లా వాసులకు దక్కనుంది. ఉపాధ్యక్ష పదవి గుంటూరు జిల్లావాసులకు వస్తుంది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో చిన్ననీటిపారుదల విభాగంలో 60 డబ్ల్యూయూఏలు ఉన్నాయి. ఇవి మైనర్ ఇరిగేషన్ కింద ఉన్నందున డబ్ల్యూఏలు మాత్రమే ఉంటాయి. చిన్న నీటిపారుదలశాఖ పరిధిలో డీసీ, పీసీలు ఉండవు.

గుంటూరు జిల్లాలో 106డబ్ల్యూఏలు

గుంటూరు జిల్లాలో కృష్ణా పశ్చిమడెల్టా కాలువల కింద 50 డబ్ల్యూఏలు, 6 డీసీలు, సాగర్ కాలువల కింద 37 డబ్ల్యూఏలు, 6 డీసీలు, గుంటూరు చానల్ కింద 14 డబ్ల్యూఏలు, 2 డీసీలు ఉన్నాయి. వీటితోపాటు మైనర్ ఇరిగేషన్ కింద 5 డబ్ల్యూఏలు ఉన్నాయి. వీటన్నిటికి సోమవారం ఎన్నికల ప్రకటన విడుదల చేశారు. ఇప్పటినుంచి దశలవారీగా ఓటర్ల జాబితా, అభ్యంతరాల స్వీకరణ, కమిటీల సమావేశాలు, కమిటీల ఎన్నికల చివరికి ప్రాజెక్టు కమిటీ ఎన్నికతో నవంబరు 29 నాటికి ప్రక్రియ పూర్తి చేస్తారు.

అమరవీరులకు అశ్రుతాంజలి


భావోద్వేగంతో కుటుంబీకురాలి కన్నీరు..


వీరుడికి వందనం


అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు నగరంపాలెం స్తూపం వద్ద సోమవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు తుపాకులను కిందకు దించి అమరవీరులకు నివాళులర్పించారు.
- ఈనాడు,అమరావతి

ఈ-ఆటో బండి షెడ్డు వీడదండి...

- ఏడాది నుంచి రోడ్డెక్కని 90 వాహనాలు
- చాలా వాటిల్లో మోటార్లు, బ్యాటరీలు మాయం


షెడ్డుకు చేరి ఇలా..

ఈనాడు
అమరావతి

కొత్త ఆటోల్లో మోటార్లు మాయమైనా.. 90 ఆటోలు అసలు ఏడాది నుంచి రోడ్డే ఎక్కకపోయినా.. పాడైనవి నెలల తరబడి పునరుద్ధరించకపోయినా పట్టించుకున్నవారు లేరు. దీంతో ఖరీదైన ఎలక్ట్రిక్ ఆటోలు ఎండకు ఎండి.. వర్షానికి తడిసి నామరూపాలు లేకుండా పోయాయి. అసలు వాటిల్లో ఎన్ని పనిచేస్తాయో తెలియకుండా ఉంది. ఇదీ గుంటూరు నగరపాలికలోని 'ఈ-ఆటోల' దుస్థితి.

- మొత్తం వాహనాలు 220
- అసలు రోడ్డెక్కనివి 90
- ప్రస్తుతం పనిచేస్తున్నవి 60
- నిర్వహణ సమస్యలతో షెడ్డుకు చేరినవి 70
- వీటి కొనుగోలుకు వెచ్చించిన మొత్తం రూ.12కోట్లు

నాడు వైకాపా ప్రచారానికి..

ఈ-ఆటోలు కొనుగోలు చేసిన ఐదారు నెలల వరకు వాటిని షెడ్డుకే పరిమితం చేశారు. ఆ సమయంలోనే మోటార్లు, ఇతర పరికరాలు చోరీ అయ్యాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొన్ని నెలల ముందు ప్రచార యావతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ఈ-ఆటోలను తాడేపల్లిలోని అప్పటి సీఎం జగన్ ఇంటి వద్దకు తరలించి ఆయనతో ప్రారంభించాలనుకున్నారు. వాహనాలు కదిలే పరిస్థితి లేకపోవడంతో అప్పటికప్పుడు అధికారులు సరఫరాదారు నుంచి తాత్కాలికంగా మోటార్లు అమర్చి జగన్ ఇంటి వద్దకు చేర్చారు. ఆ ఒక్క రోజు మాత్రమే నడిచాయి. ఆ తర్వాత వాటిని సరఫరాదారు పట్టుకెళ్లిపోయారు. ఎన్నికల కోసమే అన్నట్లుగా కొన్ని వాహనాలను రెండు మూడు నెలలు ప్రతి ఇంటికి పంపి చెత్త సేకరించారు. ఆ తర్వాత నిర్వహణ గాలికొదిలేశారు.

90 రోజుల్లో పరిశుభ్ర నగరం ఎలా?

గుంటూరులో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైందని, రానున్న 90 రోజుల్లో నగరాన్ని పరిశుభ్రంగా మార్చాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రత్యేక కార్యాచరణ తీసుకున్నారు. నిర్దేశిత వ్యవధిలో నగరం పరిశుభ్రంగా మారాలంటే పాడైన వాహనాలకు మరమ్మతుల చేయించాలి. అసలు ఇప్పటి వరకు రోడ్డెక్కని 90 ఈ-ఆటోలకు మోటార్లు బిగించాలని ప్రజారోగ్య విభాగం మొత్తుకుంటోంది. సరిపడా వాహనాలు లేకుండా ఇంటింటి నుంచి చెత్త సేకరణ ఎలా సాధ్యమని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

ఇవీ కారణాలు..

- యునెడో అందించిన ఆర్థిక సహకారంతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆటోలను కొనుగోలు చేసి నగరపాలికకు పంపింది. వాటిల్లో 500 కిలోల బరువు కలిగిన తడి, పొడి చెత్తను మాత్రమే వేసి తరలించాలి. అంతకుమించి బరువు వేయడంతో చాలా వరకు మోటార్లు పాడైపోయి వాహనాలు మొరాయిస్తున్నాయి.
- వాహనాలను కనీసం ఆరు గంటల పాటు ఛార్జింగ్ పెట్టాలి. కానీ హడావుడిగా షెడ్‌లో నుంచి వాహనం తీయడానికి ముందు ఓ గంట, రెండు గంటల పాటు ఛార్జింగ్ పెట్టి రోడ్డెక్కించం వంటివి చేస్తున్నారు. ఈ-ఆటోలో డ్రైవర్ మినహా ఎవరూ ఉండకూడదు. కానీ మరో ఇద్దరు కార్మికులను వాటిల్లో ఎక్కించుకుని నడుపుతున్నారు. దీనివల్ల త్వరగా షెడ్డుకు వస్తున్నాయి.

నిర్వహణ ఒప్పందం మరిచి..

విశాఖకు చెందిన ఓ కంపెనీ ఈ వాహనాలను సరఫరా చేసింది. రూ.1500కు వాటి నిర్వహణ బాధ్యతలను ఆ కంపెనీకి అప్పగిస్తూ నగరపాలక సంస్థ ఒప్పందం చేసుకుంది. ఆ రేటు గిట్టుబాటు కాదని ప్రస్తుతం వాటి నిర్వహణ విస్మరించారు. అయినా అధికారులు ఏనాడు కంపెనీ మెకానిక్‌లను పిలిపించి మరమ్మతులు చేయించలేదు.

చాలవరకు పనిచేయని మాట వాస్తవమే

చాలా ఆటోలు పని చేయడం లేదని మా దృష్టికి వచ్చింది. వెంటనే కంపెనీ నిర్వాహకులను పిలిచి మరమ్మతులు చేయిస్తాం. అసలు 90 ఆటోలు ఇప్పటి దాకా రోడ్డెక్కలేదని అంటున్నారు. ఇందుకు బాధ్యులైన అధికారులకు షోకాజ్ నోటీసులిచ్చి ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఉన్నతాధికారులకు చెప్పారా లేదా అనేది వివరణ తీసుకుని వారిపై చర్యలకు ఆదేశిస్తాం.
- నాగమల్లేశ్వరరావు, ఎస్ఈ, నగరపాలక

రౌడీషీటర్ కొట్టడంతోనే

యువతి బ్రెయిన్‌డెడ్!

తెనాలి ఘటనపై కొనసాగుతున్న విచారణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

గుంటూరు జిల్లా తెనాలి పట్టణం ఐతానగర్‌కు చెందిన యువతి సహానా (25)ని కొల్లిపర మండలం వల్లభాపురానికి చెందిన రౌడీషీటర్ నవీన్ కొట్టడం వల్లే ఆమె బ్రెయిన్‌డెడ్ అయినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. శనివారం సాయంత్రం తన పుట్టిన రోజంటూ ఆమెను కారులో ఎక్కించుకుని వెళ్లిన నవీన్ గంటల వ్యవధిలోనే అపస్మారక స్థితిలో ఆమెను తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలలో చేర్చి యువతి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అక్కడి నుంచి పరారయ్యాడు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో ఆమె బ్రెయిన్‌డెడ్ అయిందంటూ కుటుంబసభ్యులు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన తెనాలి రెండో పట్టణ పోలీసులు నిందితుడు నవీన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నవీన్, సహానా చాలా కాలంగా స్నేహితులుగా ఉన్నట్లు, ఆమె తాను పని చేస్తున్న హియరింగ్ అండ్ స్పీచ్‌థెరపీ కేంద్ర నిర్వాహకుల వద్ద నుంచి కొంత నగదు అప్పుగా తీసుకుని.. నవీన్‌కు ఇచ్చినట్లు, అతను సమయం గడుస్తున్నా ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వకపోవడం, ఇతర వ్యక్తిగత అంశాలపై ఇరువురి నడుమ మాటామాటా పెరిగిందని పోలీసులు విచారణలో తెలిసిందని సమాచారం. ఈ క్రమంలోనే శనివారం కారులో గొడవ మొదలైన నేపథ్యంలో సహానాను అతను కొట్టడంతో ఆమె తల డోర్‌కు, డ్యాష్ బోర్డుకు తగలడం వల్ల ఆమెకు గాయాలయ్యాయి. అప్పటికే గత కొంత కాలం నుంచి తలనొప్పితో ఇబ్బంది పడుతున్న యువతి ఈ దెబ్బల వల్ల మరింత బాధకు గురై కేకలు వేయటంతో భయపడిన నవీన్ ఆమెను తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలలో చేర్చి పరారైనట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. పోలీసులు ఘటన జరిగిన కఠెవరం శివారు ప్రాంతానికి సోమవారం వెళ్లి పరిశీలించారు. విచారణ కొనసాగుతుంది. బాధితురాలు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో కోమా దశలోనే ఉండి చికిత్స పొందుతున్నారు. తెనాలి పోలీసులు అక్కడకు వెళ్లి వచ్చారు. నిందితుడు ఉపయోగించిన కారు అతనిదేనని పోలీసులు తెలిపారు. నవీన్‌పై వెంటపడి వేధించినందుకు 354 క్లాజ్-ఎ, హత్యాయత్నంపై (307) కేసు నమోదు చేశారు. దర్యాప్తులో తేలిన అంశాలు, బాధితురాలి స్థితి ఆధారంగా తదుపరి సెక్షన్లు మారతాయని పోలీసులు పేర్కొన్నారు.

నాడు సత్యకుమార్ యాదవ్‌పై హత్యాయత్నం చేశారు

జగన్‌తోపాటు వైకాపా ముఖ్య నాయకులపై ఎస్పీకి ఫిర్యాదు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రాజధాని రైతులకు మద్దతు తెలిపారని కక్షతో అప్పటి భాజపా జాతీయ కార్యదర్శి, ప్రస్తుత ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తోపాటు తనపై దాడి చేసి చంపడానికి యత్నించిన వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలని భాజపా యువజన విభాగం పూర్వ జాతీయ కార్యదర్శి పనతల సురేష్ సోమవారం ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సురేష్ విలేకరులతో మాట్లాడారు. '2023 మార్చి 31న అమరావతి రాజధాని రైతులకు సంఘీభావం తెలిపి వస్తుండగా.. మూడు రాజధానుల శిబిరంలోని వైకాపా నాయకుల అనుచరులు, గూండాలతో సత్యకుమార్ యాదవ్ ప్రయాణిస్తున్న కారుపై రాళ్లు, కర్రలతో దాడి చేసి చంపడానికి యత్నించారు. దుర్భాషలాడారు. 'మా వెనక జగన్‌మోహన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, నందిగం సురేష్ ఉన్నారు. మిమ్మల్ని నరికేస్తామంటూ' బెదిరించారు. తరవాత బోరుగడ్డ అనిల్ సత్యకుమార్‌కు ఫోన్ చేసి చంపుతానని బెదిరించారు. యూట్యూబ్‌లో అత్యంత దారుణ పదజాలంతో దూషించారు. ఆ కారులో ఉన్న దళితుడినైన నాపై దాడిచేశారు. ఈ దాడి జగన్, సజ్జల, నందిగం ఆధ్వర్యంలో జరిగింది. ఘటన జరిగిన వెంటనే కార్యకర్తలతో కలిసి తుళ్లూరు, మంగళగిరి రాణాల్లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు' అని పేర్కొన్నారు.

తెదేపా కౌన్సిలర్‌కు బిల్డర్ కుచ్చుటోపీ

ఫ్లాట్‌లోకి అడుగుపెడితే నరికేస్తామని వైకాపా నేతలతో బెదిరింపు

ఎస్పీకి బాధితుల ఫిర్యాదు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

అపార్టుమెంటు నిర్మించి ఇస్తామంటూ రూ.1.20 కోట్లు తీసుకొని బిల్డర్ మోసగించారని తెనాలి 6వ వార్డుకు చెందిన తెదేపా కౌన్సిలర్ కొర్రపాటి లక్ష్మీ భర్త శ్రీనివాసరావుతో కలిసి సోమవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే వైకాపా నాయకులతో చంపేస్తామని బెదిరించారని పేర్కొన్నారు. స్పందించిన ఎస్పీ విచారణకు ఆదేశించారు. అనంతరం బాధితులు విలేకరులతో మాట్లాడారు. 'తెనాలిలో బిల్డర్ కృష్ణప్రసాద్ అపార్టుమెంట్ నిర్మాణం చేస్తున్నామని చెప్పి ఒక్కో ఫ్లాట్‌కు రూ.40 లక్షలు చెప్పారు. మూడు ఫ్లాట్లకు కలిపి రూ.1.20 కోట్లు తీసుకున్నారు. ఆరు నెలల్లో నిర్మాణం చేసి ఇస్తానని రిజిస్ట్రేషన్ చేశారు. 18 నెలలు అవుతున్నా నిర్మాణం చేసి ఇవ్వలేదు. కేవలం స్లాబ్ పోసి చిన్నపనులు చేశారు. గతేడాదిలో ఎప్పుడు నిర్మించి ఇస్తావు అని అడిగితే అప్పటి వైకాపా ప్రజాప్రతినిధులు వారి అనుచరులతో గంజాయి కేసు పెట్టిస్తానని బెదిరించారు. మానసిక క్షోభకు గురై శ్రీనివాసరావుకు గుండెనొప్పి రావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఇప్పటికీ నిర్మాణం చేసి ఇవ్వలేదు. మేము మా డబ్బులతో పనులు చేయించుకుందామని వెళితే ఫ్లాట్‌లోకి అడుగుపెడితే నరికేస్తామని బెదిరిస్తున్నారు. మా డబ్బులు తీసుకొని నిర్మాణం చేయకుండా మోసగించిన అతనిపై చర్యలు తీసుకోవాలని కోరాం' అని చెప్పారు.


రిజిస్ట్రేషన్ పత్రాలు చూపుతున్న కౌన్సిలర్ లక్ష్మీ భర్త శ్రీనివాసరావు

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

జిల్లాపరిషత్తు(గుంటూరు): డీఎస్సీ-2024కి హాజరయ్యే షెడ్యూల్డ్ కులాలు, తెగల అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం ఈనెల 25 వరకు పొడిగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు డి.మధుసూదన్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులను స్థానిక సచివాలయంలో 6 ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకుని దరఖాస్తుకు ఎంపిక చేస్తారన్నారు. https://jnanbhumi.ap.gov.in ధ్రువపత్రాలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నవంబరు 3న ఆన్‌లైన్‌లో ప్రాథమిక పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ సంస్థలకు కేటాయిస్తారని వివరించారు.



అర్జీలు మళ్లీ తెరుచుకోకుండా పరిష్కరించండి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే

ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తిరిగి తెరుచుకోకుండా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి జేసీ భార్గవ్ తేజ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పరిష్కారంపై శాఖల వారీగా అధికారులతో సమీక్షించి సూచనలు చేశారు. సోమవారం 190 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, ప్రత్యేక ఉపకలెక్టర్లు లక్ష్మీకుమారి, ఎం.గంగరాజు, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పింఛను ఇప్పించాలని వినతి

బంధువు రమణకు మతిస్థిమితం లేకపోవడంతో మా ఇంటిలో ఆశ్రయం ఇచ్చాం. ఆమెను రేషన్ కార్డులో చేర్పించాం. అయితే విద్యుత్తు 300 యూనిట్లు దాటిందని ఇటీవల ఆమెకు పింఛను నిలుపుదల చేశారు. దీంతో ఆమెకు మందులు, ఇతర అవసరాలకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి పింఛను మంజూరు చేయాలి. - **శివపార్వతి, బాలాజీనగర్, పాతగుంటూరు**

వైకాపా నేత అక్రమ రిజిస్ట్రేషన్



ఓబులనాయుడు పాలెంలో తమ కుటుంబానికి వారసత్వంగా వచ్చిన 5.48 ఎకరాల భూమిని వైకాపా నేతలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వైకాపా నేతలు నిషేధిత జాబితా నుంచి భూమిని తొలగిస్తామని చెప్పి తమ వద్ద డబ్బులు, బంగారం తీసుకుని ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. తీరా చూస్తే వారే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రజాదర్బార్‌లోనూ ఇటీవల ఫిర్యాదు చేశా. జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలి. - **సిద్దెల కిరణ్‌ప్రభ**

దారి ఇవ్వాలని బెదిరింపులు



తామంతా పాతబట్టల వ్యాపారం చేసుకుంటున్నాం. గతంలో వీధుల వెంబడి చేసుకుంటున్న వ్యాపారాన్ని నగరపాలక సంస్థ అధికారులు మస్తాన్ దర్గా వెనుక వైపున చర్చి సమీపంలో నిర్వహించుకోమనడంతో అక్కడే చేసుకుంటున్నాం. తమ దుకాణాల మీదుగా దారి కోసం స్థానికుడు రాజేష్ రాత్రి వేళ పొక్లెయిన్‌తో గోడను పగులగొట్టి గేట్లు నిర్మిస్తున్నారు. అడ్డొస్తే దుర్భాషలాడుతూ, బెదిరిస్తున్నారు.

- **డి.అంజమ్మ, జి.ధనలక్ష్మీ, ఒ.లీలా, ఒ.దేవి**

సాయం అందించండి



గుంటూరులోని బొంగరాలబీడు, కస్తూరిపేట, కాకుమానువారితోట ప్రాంతాల్లో ఆగస్టు చివరన కురిసిన వర్షాలకు ఇళ్లలోకి మురుగునీరు చేరి సామగ్రి మొత్తం పాడయ్యాయని, కట్టుబట్టలతో రెండ్రోజుల పాటు తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని బాధితులు వాపోయారు. సచివాలయాల సిబ్బంది వివరాలు నమోదు చేసుకెళ్లారని, సాయం అందిస్తారని చెప్పినా నేటికీ ఇవ్వలేదన్నారు. సాయం అందించాలని బాధితులతో పాటు వీసీకే మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, బీసీ సంఘ నాయకులు సీహెచ్.వాసు, వినతిపత్రం అందించారు.

20 రోజుల్లో మిర్చి రైతులకు న్యాయం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే రామాంజనేయులు చొరవ

న్యూస్‌టుడే-మిర్చియార్డు

మిర్చి రైతుల్ని నమ్మించి నట్టేట ముంచిన నల్లపాడు రోడ్డులోని రాఘవేంద్ర శీతలగిడ్డంగి యాజమాన్యం మెడలు వంచి రైతులకు న్యాయం జరిగేలా చేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో కేవలం 20 రోజుల్లోనే సమస్య పరిష్కారమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతుల్ని ఓ మిర్చి వ్యాపారి రెండు శీతలగిడ్డంగుల యాజమాన్యాలతో కుమ్మక్కై రైతుల్ని నిలువునా దగా చేశాడు. అన్నదాతలు మిర్చిని ధర వచ్చినప్పుడు అమ్ముకుందామని శీతలగిడ్డంగిలో నిల్వ ఉంచిన సరకును బినామీ పేర్లతో రూ.కోట్లలో రుణం పొందడమే గాక వారికి తెలియకుండానే అమ్ముకుని సొమ్ము చేసుకున్నాడు. సరకు ఇప్పించాలని రైతులు రోజుల తరబడి గిడ్డంగి చుట్టూ తిరుగుతున్నా వాయిదాలు వేస్తూ ఇబ్బందులు పెట్టారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చొరవతో సమస్య కొలిక్కి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే..



కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఈనెల 3న ఫిర్యాదు చేస్తున్న బాధిత మిర్చి రైతులు

లక్ష్మి చిల్లీస్ ఎక్స్‌పోర్ట్స్ పేరిట మిర్చి వ్యాపారం చేస్తున్న పాతగుంటూరుకు చెందిన రామచంద్రరావు అలియాస్ రాము గత మిర్చి సీజన్‌లో నల్లపాడురోడ్డులోని రాఘవేంద్ర, తియ్యగూర శీతలగిడ్డంగులను అనధికారికంగా అద్దెకు తీసుకున్నారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల రైతులకు చెందిన బస్తాలను రెండు శీతలగిడ్డంగుల్లో నిల్వ ఉంచారు. ఇందులో కొంత మంది రైతులు రామచంద్రరావుపై నమ్మకంతో సరకు నిల్వ పెట్టుకునే సమయంలో శీతలగిడ్డంగుల వద్దకు రాలేదు. దీనిని అవకాశంగా మలచుకున్న రాము బినామీ పేర్లతో రుణం తీసుకోవడంతో పాటు కొంత సరకు అమ్మేశారు. తాము నిల్వ ఉంచిన మిర్చి బస్తాలు ఇవ్వకుండా యాజమాన్యం కొన్ని రోజులుగా తిప్పుతుండటంతో రైతులు ఆందోళన చేయడంతో ఇది వెలుగులోకి వచ్చింది.

☛ సెప్టెంబరు 30న రైతులు నల్లపాడు ఠాణాలో ఫిర్యాదు చేశారు. కమీషన్ ఏజెంట్ రాముతో పాటు శీతలగిడ్డంగి యజమాని శివనాగిరెడ్డి తమను మోసగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఐ వంశీధర్‌ను ఆదేశించారు. పోలీసులు రంగంలోకి దిగి శివనాగిరెడ్డి, మేనేజర్ వెంకటేశ్వరరెడ్డిలను అదుపులోకి తీసుకుని విచారించారు.

ఆస్తులు అమ్ముకోకుండా చర్యలతో..: అక్టోబర్ 1న మార్కెటింగ్ జేసీ శ్రీనివాసరావు, సీఐ వంశీధర్‌లు గిడ్డంగి వద్దకు చేరుకుని బినామీ రైతుల పేర్లతో తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్, జీడీసీసీ బ్యాంకుల్లో రూ.కోట్లలో రుణాలు పొందినట్లు గుర్తించారు. మిర్చి రైతుల్ని మోసం చేసిన విషయాన్ని కలెక్టర్ నాగలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. అక్టోబర్ 3న బాధిత మిర్చి రైతులు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి న్యాయం చేయాలని కోరారు. దీనికి ఆయన వెంటనే స్పందించి బ్యాంకర్లు, పోలీసులతో సమీక్షించి మిర్చి రైతులకు డబ్బు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శివనాగిరెడ్డి, రాము ఆస్తులు అమ్ముకోకుండా జిల్లా రిజిస్ట్రార్‌తో చర్చించి బ్లాక్ లిస్టులో పెట్టించారు. దీంతో గిడ్డంగి యజమాని, వ్యాపారి రైతులకు సొమ్ము చెల్లించేందుకు ముందుకొచ్చారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే రామాంజనేయులు చొరవతో రైతులకు రూ.కోటికి పైగా అందజేశారు.

కొల్లిపరలో 40.6 మి.మీ వర్షపాతం

కలెక్టరేట్(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు సగటున 7.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. కొల్లిపర మండలంలో అధికంగా 40.6 మి.మీ. వర్షం కురిసింది. తెనాలి 20.8 మి.మీ., ఫిరంగిపురం 15.8, దుగ్గిరాల 12.8, మేడికొండూరు 9.4, చేబ్రోలు 7.8, పొన్నూరు 7.4, గుంటూరు పశ్చిమ 3.2, వట్టిచెరుకూరు 2.4, పెదనందిపాడు 1.8, ప్రత్తిపాడు 1.8, కాకుమాను 1.4, గుంటూరు తూర్పు 1.2, తాడికొండ 1.2, తుళ్లూరు 1 మి.మీ. వర్షపాతం నమోదైంది.

రౌడీషీటర్ బోరుగడ్డను కస్టడీకి ఇవ్వాలని పోలీసుల పిటీషన్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను కస్టడీకి ఇవ్వాలని గుంటూరు అరండల్‌పేట సీఐ శ్రీనివాసరావు న్యాయస్థానాన్ని కోరారు. ఈమేరకు ఆయన అయిదో అదనపు మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం పిటీషన్ దాఖలు చేశారు. కోర్టు విచారించి నిర్ణయం తీసుకోనుంది. గుంటూరులోని ఏఈఎల్‌సీ చర్చి వివాదంలో తలదూర్చి కోశాధికారి కర్లపూడి బాబూప్రకాష్‌ను రూ.50 లక్షలు ఇవ్వాలని, లేదంటే చంపుతానని అనిల్‌కుమార్ బెదిరించాడు. ఈ కేసులో పోలీసులు బోరుగడ్డను అరెస్టు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేయాల్సి ఉన్నందున కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉంటే కర్నూలు, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల్లోనూ అనిల్‌కుమార్‌పై పీటీ వారంట్లు దాఖలయ్యాయి.

నా భర్తకు హాని జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత

నా భర్తకు ఎటువంటి హాని జరిగినా అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని బోరుగడ్డ అనిల్‌కుమార్ భార్య మౌనిక పేర్కొన్నారు. గుంటూరులో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. 'అక్రమ కేసులు బనాయించి దుర్భాషలాడుతూ పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై కక్ష గట్టి వేధిస్తుంది. జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాం. కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే ఫోన్‌లో పరామర్శించి అనిల్ గురించి వివరాలడిగి తెలుసుకున్నారు'.. అని ఆమె పేర్కొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించండి

ఆరోగ్యశాఖ రాష్ట్ర కార్యాలయం ఎదుట నిరసన

మంగళగిరి, న్యూస్‌టుడే: నిర్లక్ష్యం వీడి ఆశా కార్యకర్తల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు కోరారు. మంగళగిరిలోని ఆరోగ్యశాఖ రాష్ట్ర కార్యాలయం వద్ద రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఎన్నారై జంక్షన్ నుంచి ర్యాలీగా ఏపీఐఐసీ భవనం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పొడిగించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అడిషినల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ అనిల్‌కుమార్‌కు అందజేశారు. ఆశా వర్కర్ల రాష్ట్ర ఇన్‌ఛార్జి వెంకటసుబ్బయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



బైఠాయించిన ఆశా కార్యకర్తలు, నాయకులు

ఏఎన్‌యూలో కశ్మీర్ యువ సమ్మేళనం



యువసమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య గంగాధర్

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కశ్మీర్ యువ సమ్మేళనం ఘనంగా ప్రారంభమైంది. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ ప్రారంభించి ప్రసంగించారు. దేశంలో ఎక్కువ సంఖ్యలో ఉన్న యువతను జాతీయ ఐక్యత, దేశ సమగ్రత, శాంతి ప్రతిపాదకులుగా వినియోగించేలా వీరిని తయారు చేయాలని సూచించారు. నెహ్రూ యువ కేంద్రం ఏపీ సంచాలకులు అంశుమన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ కశ్మీర్ యువకులలో జాతీయ ఐక్యత, సమగ్రతను పెంచే లక్ష్యంతో దీనిని ఏర్పాటుచేశామన్నారు. జిల్లా నెహ్రూ యువ కేంద్ర అధికారిణి కిరణ్మయి మాట్లాడుతూ ఈ సమ్మేళనంలో సదస్సులు, క్షేత్రస్థాయి పర్యటనలు ఉంటాయన్నారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మెప్మా ఏర్పాటు చేసిన ప్రదర్శనశాల ఆకట్టుకుంది. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రత్నశీలామణి, రిజిస్ట్రార్ సింహాచలం, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ దివ్యతేజోమూర్తి, ఓఎస్‌డీ రవికుమార్, డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి, విశాఖ అధికారి మహేశ్వరరావు పాల్గొన్నారు.

పరిహారం పంపిణీలో అవకతవకలు నిజమే

రూ.16 లక్షలు రికవరీ చేసిన అధికారులు

మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరు మండలం యలవర్తిపాడు రెవెన్యూ పరిధిలో పంట నష్ట పరిహారం పంపిణీ విషయంలో అవకతవకలు జరిగాయని అధికారులు నిగ్గు తేల్చారు. గ్రామంలో సోమవారం 5వ రోజూ విచారణ కొనసాగింది. దీనికి సంబంధించి ఇప్పటి వరకు మొత్తం రూ.16 లక్షలు రికవరీ చేశామని, మంగళవారంతో విచారణ ముగుస్తుందని అధికారులు వెల్లడించారు. ఏడీఏ(డీఆర్‌సీ) సునీత, ఫిరంగిపురం ఏవో వాసంతి తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో అక్కడక్కడ ఎలాంటి సాగులో లేని ఖాళీ దుక్కుల్లో పత్తి పంట వేసినట్లు తప్పుగా చూపుతూ మొత్తం 20 ఎకరాల్లో పంట దెబ్బ తిందని లెక్కల్లో చేర్చారు. కొన్ని చోట్ల మిరప తోట వేసిన పొలాదీ ఇదే పరిస్థితి. దీనికి తోడు అక్కడక్కడ పొలం హక్కు దారులు, కౌలు దారులకు సంబంధం లేని మూడో వ్యక్తుల పేరిట పంట నష్ట పరిహారం సొమ్ము జమ అయిందని తేలింది. కౌలుదారు గుర్తింపు కార్డులు జారీ విషయంపై స్థానిక రెవెన్యూ అధికారులను ప్రశ్నించామని, మండల వ్యవసాయాధికారి వివరణ కూడా కోరినట్లు అధికారులు వివరించారు. ఆ నివేదిక ఉన్నతాధికారులకు పంపించామని, మంగళవారం పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

ఇదో రకం మోసం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఒక వృద్ధురాలిని ఇద్దరు వ్యక్తులు మోసగించి రూ.లక్షతో ఉడాయించారు. పోలీసుల కథనం ప్రకారం.. అశోక్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు చెరుకూరి రమణ ఒక్కరే ఉంటున్నారు. ఇద్దరు వ్యక్తులు వాహనంపై వచ్చి చంద్రబాబు తరపున ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, మిక్సీ వస్తున్నాయని నమ్మించారు. పసుపు చీరపై నగదు పెట్టి ఫొటో దిగాలని మాయమాటలు చెప్పారు. వారి మాటలు నమ్మిన ఆమె పసుపు రంగు చీరపై రూ.లక్ష పెట్టారు. మోసగాళ్లు ఎరుపు రంగు చీర కూడా కావాలని అడగడంతో ఆమె లోపలకు వెళ్లారు. ఆమె తిరిగి వచ్చే సరికే దొంగలు డబ్బుతో సహా పరారయ్యారు. దీంతో ఆమె పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మార్గదర్శకాలు పాటించాల్సిందే

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: రైల్వే బోర్డు భద్రత విషయంలో నిర్దేశించిన మార్గదర్శకాలను అందరూ పాటించాల్సిందేనని ద.మ.రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ సూచించారు. సికింద్రాబాద్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మండల రైల్వే అధికారి రామకృష్ణ ఇతర అధికారులతో మాట్లాడుతూ అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. వర్షాకాలంలో ట్రాక్ నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సరకుల రవాణా లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు.

91.9 FM Vijayawada ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు


సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

వరద బాధితులకు ఏఎన్‌యూ రూ.18 లక్షల విరాళం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బోధన, బోధనేతర సిబ్బంది రూ.18,22,106 చెక్కును సచివాలయంలో సోమవారం సీఎం చంద్రబాబుకు అందజేశారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, ఇతర అధికారులు, సిబ్బంది ఒక రోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఓఎస్‌డీ రవికుమార్, ఇంజినీరింగ్ కళాశాల సహాయ ప్రిన్సిపల్ డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ అనిత, వికాస కార్యదర్శి కావూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న వీసీ గంగాధర్, ఎమ్మెల్యే నరేంద్ర, అధికారులు, సిబ్బంది

చోరీ కేసులో నిందితుల అరెస్టు

రూ.37 లక్షల సొత్తు స్వాధీనం

మంగళగిరి, న్యూస్‌టుడే: చోరీకి పాల్పడిన ఓ మహిళతో సహా మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళగిరి గ్రామీణ పోలీసుస్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకట్ వివరాలు వెల్లడించారు. మిడ్‌వ్యాలీ సిటీలో నివసిస్తున్న డాక్టర్ ఇంట్లో పనిచేస్తోన్న వెంకట రమణ అనే మహిళ దశలవారీగా చోరీకి పాల్పడుతూ వస్తుంది. రోజుకో వస్తువు, నగదును అపహరించుకువెళుతుంది. అనుమానం వచ్చిన సదరు యజమాని ఈ నెల 15న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు పనిమనిషితోపాటు విజయవాడ సమీపంలోని జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి చెందిన వేముల వెంకన్న అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి సుమారు 30 గ్రాములు బంగారు వస్తువులు, రూ.11.9 లక్షలు నగదు, రూ.1.50 లక్షల విలువైన ద్విచక్ర వాహనం, రూ.1.90 లక్షలు విలువచేసే రెండు మొబైల్ ఫోన్లు మొత్తం రూ.37 లక్షలు సొత్తును వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

'రాష్ట్రాల హక్కులు హరించడానికే జమిలి ఎన్నికలు'

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే: పెట్టుబడిదారులకు మేలు చేయటానికి ప్రధాని మోదీ జమిలి ఎన్నికల విధానాన్ని తెరపైకి తెచ్చారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. వీఐ లెనిన్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో సమకాలిన రాజకీయ పరిణామాలపై నిర్వహించిన సభలో అతిథిగా హాజరైన రాఘవులు ప్రసంగించారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు ఒక దఫాలో నిర్వహించలేక ఏడు దఫాల్లో నిర్వహిస్తున్న తరుణంలో అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలు ఒకేసారి ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే పోలీసు బలగాలు సరిపోక ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి పంపుతున్నారని, మిలటరీ ఆధ్వర్యంలో జమిలి ఎన్నికలు నిర్వహిస్తారా అని పేర్కొన్నారు. ఒకవైపు రాష్ట్రాల హక్కులు హరిస్తున్న కేంద్రం జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలన్నింటినీ తమ గుప్పెట్లో పెట్టుకోవటానికి ఎత్తుగడ వేస్తుందని ఆరోపించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ 29 రాష్ట్రాల్లో అధికారంలో ఉండాలి లేదా తాము చెప్పిన పార్టీయే ఉండాలనే లక్ష్యంతో భాజపా విధానాలు ఉన్నాయన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు బాబూరావు, జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా నాయకులు నేతాజీ, నళినీకాంత్, అప్పారావు, భావన్నారాయణ, రవి, చెంగయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, వేదికపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు, బాబూరావు, రామారావు, నళినీకాంత్ తదితరులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 133, రిటైల్ ధర - 155, చికెన్ విత్‌స్కిన్ - 225, చికెన్ స్కిన్‌లెస్ - 256.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ఆర్టీసీ బస్సు ఢీ.. మహిళ దుర్మరణం

పట్నంబజారు: ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటనలో మహిళ మృతి చెందారు. తూర్పు విభాగపు ట్రాఫిక్ పోలీసుల కథనం ప్రకారం.. పొన్నూరు మండలం మామిళ్లపల్లికి చెందిన తోట భాగ్యమ్మ (76) కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం ఉదయం గుంటూరుకు చేరుకొని ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం తిరిగి గుంటూరు నుంచి మామిళ్లపల్లికు వెళ్లేందుకు బి.ఆర్.స్టేడియం సెంటర్‌కు చేరుకున్నారు. సోమవారం సాయంత్రం అక్కడ నిలుపుదల చేసిన ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా.. గుంటూరు నుంచి పొన్నూరు రోడ్డు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు భాగ్యమ్మ కాళ్లపై ఎక్కింది. తీవ్ర గాయాల పాలైన ఆమెను స్థానికులు 108 ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ ఆర్టీసీ బస్సును స్వాధీనపరచుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

చెత్త తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

కుంచనపల్లి(తాడేపల్లి), న్యూస్‌టుడే: మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని విలీన గ్రామమైన కుంచనపల్లిలో పారిశుద్ధ్యం మెరుగుపరిచారు. 'ఈనాడు'లో ఈ నెల 21న 'విలీన కష్టాలు వీడేదెప్పుడో?' శీర్షికన ప్రచురించడంతో స్పందించిన నగరపాలక కమిషనర్ అలీంబాషా అక్కడి చెత్తకుప్పలను కార్మికులను శుభ్రం చేయించారు.

అమరావతితో లక్షల మందికి ఉపాధి



అభివాదం చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: అమరావతి నిర్మాణం పూర్తయిన తర్వాత రాబోయే కాలంలో లక్షల మందికి ఉపాధి కలుగుతుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన ప్రత్తిపాడులో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ వినుకొండ నుంచి వచ్చే నాలుగు లైన్ల హైవేను తాడికొండ మీదుగా అమరావతి వరకు 25 కిలోమీటర్ల రోడ్డు పొడిగించి కలుపుతున్నామని అన్నారు. అమరావతిలో రూ.250 కోట్ల వ్యయంతో టెక్నాలజీ స్కిల్ ట్రైనింగ్ సెంటర్, ప్రత్తిపాడుకు ఈఎస్ఐ 100 పడకల వైద్యశాలను తీసుకువచ్చామన్నారు. చంద్రబాబు బ్రాండ్ వల్ల ఇదంతా సాధ్యమైందన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఉపాధి హామీ నిధులు రూ.4 వేల కోట్లతో సీసీ రోడ్లు, కాల్వలు నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రత్తిపాడుకు రూ.3 కోట్లు మంజూరు చేశామన్నారు. రానున్న 60 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని గుంటూరు ఛానల్ పొడిగింపు, నల్లమడ కాల్వ ఆధునీకీకరణ కోసం నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టరు బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఉచిత ఇసుక, దోచుకునే ఇసుక ఏంటో.. వైకాపా నాయకులు తెలుసుకోవాలన్నారు. ఇసుక తీసుకొస్తుండగా లబ్ధిదారులను ఆపితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పూర్తి పారదర్శక మద్యం విధానాన్ని తీసుకువచ్చామన్నారు. కోయవారిపాలెం వద్ద పెమ్మసానికి కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. నాలుగు కిలోమీటర్ల మేర బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన, భాజపా నియోజకవర్గ సమన్వయకర్తలు కొర్రపాటి నాగేశ్వరరావు, రవిదేవరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



కోయవారిపాలెం నుంచి ద్విచక్ర వాహన ర్యాలీ

సేంద్రియ సాగు లాభదాయకం



సేంద్రియ పంటలను పరిశీలిస్తున్న తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, యడ్లపల్లి తదితరులు

కొర్నెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: సేంద్రియ వ్యవసాయంతో రైతులకు సంతృప్తికర లాభాలు వస్తున్నాయని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు రైతునేస్తం ఫౌండేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. స్థానిక రైతులతో మాట్లాడి సాగు విధానాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట ఉత్పత్తుల్లో రసాయన మందుల అవశేషాలు లేకపోవడం వల్ల ఇతర దేశాలకు ఎగుమతి సులభతరం అవుతుందన్నారు. ప్రాసెసింగ్ చేసిన సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉందన్నారు. రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వ్యవసాయ రంగంలో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రమంతటా సేంద్రియ పంటలపై అవగాహన సదస్సులు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఉప్పుటూరి సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.

చినవడ్లపూడి.. సమస్యల సుడి

పరిష్కరించాలని గ్రామస్థులు విన్నపం

చినవడ్లపూడి(మంగళగిరి), న్యూస్‌టుడే

మంగళగిరి ప్రాంతంలో అతి చిన్న గ్రామం చినవడ్లపూడి. మొత్తం జనాభా సుమారు 300 మంది ఉంటారు. శివారు గ్రామం కావడంతో పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పంట పొలాలకు వెళ్లే దారి ఇలా..

శ్మశానవాటిక చాలక ఇబ్బందులు..

గ్రామ శివారు ప్రాంతంలో శ్మశానవాటిక ఏర్పాటు చేశారు. కానీ షెడ్డు, ఇతర వసతులు లేకపోవడంతో అంత్యక్రియల నిర్వహణ కష్టతరంగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు. దీనికి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారిందని, మరికొంత అదనపు స్థలం కేటాయించి వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు.



చినవడ్లపూడి వెళ్లే మార్గం

ఇళ్లకు వెళ్లేందుకు భయం..

పెదవడ్లపూడి నుంచి చినవడ్లపూడి వెళ్లే మార్గంలో రాకపోకలు సాగించేందుకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి ఎనిమిది గంటలు దాటితే మందుబాబులు చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ప్రశ్నిస్తే దూషిస్తున్నారని, మహిళలు ఇళ్లకు రావాలంటేనే వణికిపోతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్తు స్తంభాలు..

గ్రామంలోకి ప్రవేశించే చోట, శివారు ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయి ఉన్నాయి. వర్షాలు, ఈదురు గాలులు వస్తే కూలిపోయే పరిస్థితి ఉంది. దీనికి తోడు పెదవడ్లపూడి, చినవడ్లపూడి మధ్య వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. కొన్ని చోట్ల వీధిదీపాలు ఉన్నా సరిగా వెలగడం లేదు. మరోవైపు పంట పొలాలకు వెళ్లే రహదారి గుంతలతో అధ్వానంగా మారింది.



కూలేందుకు సిద్ధంగా..



నిరుపయోగంగా చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం

రహదారుల వెంటే చెత్తకుప్పలు..

గ్రామంలో సేకరించిన చెత్తను రోడ్ల పక్కనే నిల్వ చేస్తున్నారు. ఊరు శివార్లతోపాటు గ్రామంలోకి ప్రవేశించే ప్రాంతాల్లో చెత్తను రోడ్డు వెంబడి నిల్వ చేస్తున్నారు. దీనివల్ల దుర్వాసన వెదజల్లుతుందని వాపోతున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను తడి, పొడి వేరుచేసేందుకు సంపద కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానిని వినియోగంలోకి తీసుకురాకుండా నిరుపయోగంగా వదిలివేశారు.

బాధితులకు మంత్రి లోకేశ్ అండ



బాధితులకు చెక్కులు అందజేస్తున్న తెదేపా నాయకులు

మంగళగిరి, న్యూస్‌టుడే: విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో మంగళగిరిలోని 20, 31 వార్డుల్లో ఆరోగ్య సమస్యలతో బాధపడిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నగదును మంజూరు చేయించారు. దీంతో 27వ వార్డులోని టిడ్కో గృహసముదాయంలో జంజనం సాంబశివరావుకు రూ.20 వేలు, 31వ వార్డులో షేక్ నిజియాబేగానికి రూ.25 వేలు చొప్పున చెక్కులను సోమవారం పట్టణ తెదేపా ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, అబ్దుల్‌మజీద్, దుర్గారావు తదితరులు అందజేశారు. మంగళగిరి లక్ష్మీనరసింహకాలనీకి చెందిన శ్రీనివాసరావుకు రూ.2 లక్షలు అందజేశారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలో నగరపాలక సంస్థ ఆధ్వర్యాన ఏడు ఆధార్ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ అలీంబాషా సోమవారం తెలిపారు. పట్టణంలోని వీజే జూనియర్ కళాశాల ఆవరణలో ఈ కేంద్రం ఉంటుందని, మార్పులు, చేర్పులతోపాటు కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 22 నుంచి 25 వరకు కొనసాగుతాయని చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని షేక్ నస్రీన్ రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శోభాదేవి తెలిపారు. నరసరావుపేటలో జరిగిన ఎంపికలో బాలిక ప్రతిభ కనబరిచిందన్నారు. నస్రీన్‌ను సోమవారం సత్కరించారు. బాలికను పీడీ పద్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాఫిక్ నిలిచి ఇక్కట్లు

రేవేంద్రపాడు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: రెండు విద్యాసంస్థలకు చెందిన బస్సుల డ్రైవర్లు పోటీ పడి ఒకరికొకరు వాహనాలను అడ్డుపెట్టుకోవడంతో రేవేంద్రపాడు వంతెన కూడలి వద్ద సోమవారం సాయంత్రం 6 నుంచి ఏడు గంటల వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు.

బాధ్యతల స్వీకరణ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దారుగా ఎ.శివశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు అర్బన్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన పద్మజ జిల్లా కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

మాజీ ఎమ్మెల్యే అమృతరావు జయంతి

మేడికొండూరు, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే తమనంపల్లి అమృతరావు జయంతిని మంగళవారం విశదల గ్రామంలో నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ అమృతరావు విశాఖ ఉక్కు పోరాటంలో కీలకంగా వ్యవహరించారన్నారు. వైకాపా నాయకులు మేకతోటి దయాసాగర్, ప్రసాదరావు, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ విధానాలు స్ఫూర్తిదాయకం



పూజలో మంత్రి రామానాయుడు, రంగిశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఘనత మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు దక్కుతుందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం దుగ్గిరాల మండలం చిలువూరులో జరిగిన గంగానమ్మతల్లి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయ, రంగిశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకులు జగదీష్, రమేష్‌లతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రంగ అభివృద్ధి, మంగళగిరిని పరిశ్రమల హబ్‌గా తయారు చేసేందుకు మంత్రి లోకేశ్ అవలంబిస్తోన్న విధానాలు తమలో స్ఫూర్తి నింపాయన్నారు. నియోజకవర్గ పరిధిలో మేజర్, మైనర్ కాల్వలు, మురుగు కాల్వల అభివృద్ధికి కృషి చేస్తామని, శివారు భూములకు సాగునీరు అందిస్తామన్నారు. పోలవరం నిర్మాణం పూర్తయి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు. తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఎంపీపీ షేక్ జబీన్, పోతినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు మరియరోజమ్మ, తోటకూర సీతారామయ్య, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, యడ్ల సాయికృష్ణ, సుంకర బిట్టు తదితరులున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? డోలాస్‌నగర్ వద్ద ప్రభు నగర్‌లో మురుగు నిల్వ ఉండి దుర్వాసన వ్యాపిస్తోంది. దోమల వల్ల జ్వరాలు వ్యాపిస్తున్నాయి.

- ఏసురత్నం, ప్రభునగర్

✔ మురుగు తొలగించి సమస్య లేకుండా చేస్తాం.

- శ్రీకాంత్, డిప్యూటీ కమిషనర్, నగరపాలక సంస్థ

- తాడేపల్లి, న్యూస్‌టుడే

? నిడుముక్కల గ్రామం నుండి బడేపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో వ్యర్థాలు తగులబెడుతున్నారు. పొగతో రోడ్డు కనిపించక వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

-కోటేశ్వరరావు, గ్రామస్థుడు

✔ వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. దూర ప్రాంతంలో డంప్ చేయిస్తాం.

- సౌజన్య, పంచాయతీ కార్యదర్శి, నిడుముక్కల

-తాడికొండ, న్యూస్‌టుడే

పోలీసుల త్యాగాలు మరువలేనివి



మంగళగిరిలో నివాళులర్పిస్తున్న కమాండెంట్ నగేష్‌బాబు

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పోలీస్ అమర వీరుల త్యాగాలు మరువలేనివని ఫిరంగిపురం సీఐ రవీంద్రబాబు తెలిపారు. ఇక్కడి పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. కమాండెంట్ నగేష్‌బాబు, అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడిషనల్ కమాండెంట్ ఆశీర్వాదం, అసిస్టెంట్ కమాండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఫిరంగిపురంలో..

పేదల పాలిట 'ఆరోగ్య సంజీవని'



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన 'ఆరోగ్య సంజీవని' వాహనం ద్వారా 90 మందికి సోమవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. విజయవాడ శంకర్ కంటి నేత్ర వైద్యశాలలో 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించేందుకు కృషిచేసినట్లు తెలిపారు. తెదేపా నాయకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేటి నుంచి భూ రీసర్వే ప్రక్రియపై గ్రామసభలు



తహసీల్దార్ మల్లేశ్వరి

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఇప్పటికే సమగ్ర భూ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లేశ్వరి చెప్పారు. భూములకు సంబంధించిన ఏ సమస్య అయినా అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. రెవెన్యూ, సర్వే శాఖలకు చెందిన అధికారులు పాల్గొంటారన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అధికారులు సంబంధిత రికార్డులతో ఆ గ్రామంలోనే అందుబాటులో ఉంటారని చెప్పారు. 22న దేవరపల్లి అగ్రహారం, 23న చింతలపూడి, 24న శృంగారపురం, 25న చినపాలెం, 26న మోరంపూడి, 29న తుమ్మపూడి, 30న కంతంరాజుకొండూరులలో గ్రామసభలు ఉంటాయన్నారు.

మేడికొండూరు, పెదనందిపాడు, న్యూస్‌టుడే: మేడికొండూరు మండలం 22వ తేదీన పొట్లపాడు, 23న పొట్లపాడు, 24న విశదల, 25న డోకిపర్రు, 26న కొర్రపాడు, 29న యలవర్తిపాడు, 30న సిరిపురం, వచ్చే నెల 1న మంగళగిరిపాడు, 2న వరగాని, 5న పాలడుగు, 6వ తేదీ మేడికొండూరులో భూరీసర్వేపై గ్రామ సభలు జరుగుతాయి.

★ పెదనందిపాడు మండల పరిధిలో 22న రాజుపాలెం, 23న అన్నవరం, 24న రావిపాడు, 25న ఉప్పలపాడు, 26న కొప్పర్రు ,29న గోరిజవోలుగుంటపాలెం, 30న పుసులూరు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు శంకర్‌బాబు తెలిపారు. వచ్చే నెల 1 2, 5, 6, 7 తేదీలలో వరుసగా పెదనందిపాడు, కట్రపాడు, అన్నపర్రు, పాలపర్రు, వరగానిలలో సభలు ఉంటాయన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యం



ప్రార్థనలో మంత్రి సవిత, అబద్దయ్య తదితరులు

మెల్లెంపూడి(తాడేపల్లి), న్యూస్‌టుడే: ముస్లింల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ కట్టుబడి ఉన్నారని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. తాడేపల్లి మండలం మెల్లెంపూడిలో సోమవారం రాత్రి జరిగిన గ్యార్మీ పండుగలో మంత్రి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ హిమామ్, మౌజమ్‌లకు తొలిసారిగా ఆర్థికసాయం అందించింది తెలుగుదేశం ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఆ వర్గానికి మేలు చేకూర్చే విధంగా వక్ఫ్ బోర్డు భూములు సర్వే చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. పద్మశాలీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, మండలపార్టీ అధ్యక్షుడు అమరా సుబ్బారావు, గ్రామపార్టీ అధ్యక్షుడు షేక్ నాగుల్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్, షేక్ కాశింబాబు తదితరులు పాల్గొన్నారు.

రాయపూడిలో ..

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం రాయపూడిలో గ్యార్మి జెండాల పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఊరేగింపు చేసి తూర్పు వీధిలోని జెండా చెట్టు వద్ద ప్రార్థనలు చేశారు. సోమవారం అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామ తెదేపా అధ్యక్షుడు మూల్పూరి శ్రీనివాసరావు, షేక్. మాబూ సుభానీ కోకిలా, షేక్.సాహెబ్ జాన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు

చినకాకాని(మంగళగిరి), న్యూస్‌టుడే: రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధికంగా మంగళగిరి మండలం చినకాకాని ఎన్నారై మెడికల్ కళాశాలలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు నెఫ్రాలజీ వైద్యులు డాక్టర్ వరప్రసాద్, యూరాలజీ వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద వీటిని పలువురు పేదలకు ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 302 శస్త్రచికిత్సలు పూర్తయినట్లు తెలిపారు. ఇందులో పాల్గొన్న వైద్య బృందానికి ఆరోగ్య సిబ్బందికి అభినందనలు తెలిపారు.

క్రీడా పరికరాల వితరణ



ఆట వస్తువులు అందజేస్తున్న ఎంఈవో సత్యనారాయణమూర్తి తదితరులు

లేమల్లెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: లేమల్లెపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రూ.50 వేలు విలువైన క్రీడా పరికరాలను ఎంఈవో సత్యనారాయణమూర్తి సోమవారం ఉచితంగా అందించారు. బండి సాహితీరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండి అశోక్‌రెడ్డి, సుధారాణిల జ్ఞాపకార్థం వీటిని అందించారని ఎంఈవో తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌బాబు, ఏఎంసీ ఛైర్మన్ ఎస్తేరురాణి, వైస్ ఛైర్మన్ పానుగంటి చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాల అందజేత

తాడికొండ, న్యూస్‌టుడే: గుంటూరుకు చెందిన శ్రీవిద్య ఉమెన్స్ ప్యాషన్‌వేర్ యజమానుల సహకారంతో తాడికొండ గ్రామంలోని వెల్లంకి వెంకటప్పయ్య ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం రూ 10 వేలు విలువ చేసే భోజన కంచాలు పంపిణీ చేశారు. హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు రమణయ్య, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

కారు ఢీకొని ద్విచక్ర వాహదారుడి మృతి



నుజ్జునుజ్జయిన వాహనం

తుళ్లూరు, న్యూస్‌టుడే: మితిమీరిన వేగం, నిర్లక్ష్యం ఒక నిండు ప్రాణం గాల్లో కలిసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ ప్రసాదంపాడుకు చెందిన బి.రాము (50) బిల్డర్‌గా కుటుంబాన్ని పోషిస్తున్నారు. సోమవారం తుళ్లూరు మండలంలోని తాళ్ళాయపాలెం శైవక్షేత్రంలో పూజలు నిర్వహించి తిరిగి సీడ్‌యాక్సెస్ రహదారిపై ఇంటికి బయలుదేరారు. రోడ్డుకు ఎడమవైపు మార్జిన్‌లో బైక్ నడుపుతున్నారు. అదే సమయంలో కొండపల్లికి చెందిన ఎ. హర్షవర్ధన్ కారులో విజయవాడ వైపు నుంచి అతి వేగంగా వస్తున్నాడు. వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న కారును దాటించే క్రమంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి డివైడర్ పైకి దూసుకుపోయింది. రాము తల డివైడర్‌కు తగిలి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనం అక్కడకు చేరుకునే సరికే ఆయన మృతి చెందారు. మృతుడికి ఒక కూమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రమాదం జరిగిన చోట బందోబస్తు కోసం వచ్చిన పోలీస్ కానిస్టేబుల్ కూర్చొని ప్రమాదానికి ముందు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఆయనకు త్రుటిలో ప్రమాదం తప్పింది. కారు ముందు భాగం ధ్వంసం కాగా.. కారు నడుపుతున్న హర్షవర్ధన్‌కు గాయాలేమీ కాలేదు. ట్రాఫిక్ తుళ్లూరు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెనాలి

●తెనాలి ●పొన్నూరు

సందడిగా ఎస్పీఎఫ్ క్రీడలు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీఎఫ్) క్రీడలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. సిబ్బందికి సోమవారం క్రికెట్, బ్యాడ్మింటన్, 5 కిలోమీటర్ల పరుగుపందెం, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బ్యాడ్మింటన్‌లో కమాండెంట్ శంకరరావు, ఇన్‌స్పెక్టర్ వరప్రసాదలు విజయం సాధించారు. క్రికెట్ లీగ్ పోటీల్లో విజయవాడ, తిరుపతి జట్లు విజయం సాధించాయి. వాలీబాల్ పోటీల్లో రాజమహేంద్రవరం 1, రాజమహేంద్రవరం 2 జట్లు ఫైనల్‌కు చేరాయి. 5 కిలోమీటర్ల పరుగు పందెంలో తిరుపతికి చెందిన నాయుడు, విజయవాడకు చెందిన నారాయణ తొలి రెండు స్థానాల్లో నిలిచారు.

యోగా పోటీల్లో పతకాలు

తెనాలి టౌన్: నేచురల్ యోగా అసోసియేషన్, తమిళనాడు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో తమ వశిష్ఠ యోగా కేంద్రం, తెనాలి విద్యార్థినులు వర్షిక బంగారు, వేద్య రజత పతకాలు సాధించినట్లు యోగా గురువు నాదెళ్ల లావణ్య సోమవారం తెలిపారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నేచురల్ యోగా అసోసియేషన్, కృష్ణగిరి వారు 1.20 లక్షల మందితో నిర్వహించిన యోగా అవగాహన కార్యక్రమంలో గురువుగా పాల్గొన్నందుకు తనకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు బెస్ట్ యోగా టీచర్‌గా గుర్తింపు ఇస్తూ ధ్రువపత్రం పంపినట్లు ఆమె వివరించారు.


పతకాలు సాధించిన విద్యార్థినులతో యోగా గురువు లావణ్య



బహుమతులు అందుకున్న విజేతలతో మాంటిస్సోరి పాఠశాల ప్రిన్సిపల్ జేమ్స్ మొరెలి, ఉపాధ్యాయులు


విజేతలతో భాష్యం ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ పి.రాము, ఉపాధ్యాయులు

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం రెండు పాఠశాలల్లో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలకు మంచి స్పందన లభించింది. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై జరిగిన వ్యాస రచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ☛ స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో పదో తరగతి విద్యార్థులు జె.షమిత్ (ప్రథమ) షేక్.సుహాన (ద్వితీయ), ఎం.పూర్ణచంద్రిక (తృతీయ) స్థానాలు పొందగా ప్రిన్సిపల్ డాక్టర్ జేమ్స్ మొరెలి వారిని అభినందించి బహుమతులు, ధ్రువపత్రాలు అందించారు. వైస్ ప్రిన్సిపల్ విజయకుమారి, హెచ్‌వోడీ శారద, ఇతర ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ☛ స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో పదో తరగతి విద్యార్థినులు పి.మౌనిక (ప్రథమ), జి.లాస్యప్రియలక్ష్మి (ద్వితీయ), తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎం.జనని (తృతీయ) స్థానాలు సాధించగా ప్రిన్సిపల్ పి.రాము విజేతలను అభినందించి బహుమతులు, ధ్రువపత్రాలు అందించారు. వైస్ ప్రిన్సిపల్ మోహన్‌దాస్, ప్రధానోపాధ్యాయిని ఇంద్రజ, ఇతర ఉపాధ్యాయులు పర్యవేక్షించారు

వైకాపా పాలకుల నిర్లక్ష్యం..

నిడుబ్రోలులో పురప్రజలకు ఇబ్బందులు

మౌలిక వసతులు దూరం

పొన్నూరు, (నిడుబ్రోలు) న్యూస్‌టుడే

గత వైకాపా పాలనలో పట్టణంలో మౌలిక వసతులు కల్పించే ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. నిడుబ్రోలు 14వ వార్డు వడ్డిముక్కల రోడ్డులో సాగునీటి కాలువపై నిర్మించిన వంతెన వాహనాల సంఖ్య పెరగడంతో ఇరుకుగా మారింది. 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం నూతన వంతెన నిర్మాణ పనులకు రూ.10 లక్షలు లోపు నిధులు మంజూరు చేసింది. 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చిన తరవాత వంతెన నిర్మాణ పనులు చేపట్టలేదు. వంతెన వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. రోజు ప్రమాదం జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా మరలా నిధులు మంజూరు చేసి వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు.

☛ నిడుబ్రోలులోని 8, 10, 11, 12, 13 వార్డుల్లోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు దట్టంగా పెరగడంతో విషసర్పాలు గృహాల్లోకి వస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పిచ్చి మొక్కలను తొలగించేలా తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన ఎటువంటి చర్యలు తీసుకోలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. కొన్ని స్థలాలు పల్లంగా ఉండటంతో నీరు నిలబడుతోంది. ఆ ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు పేర్కొన్నారు.

☛ పట్టణంలోని రైలుపేట, బీసీ, ఎస్టీ, అంబేద్కర్ కాలనీల్లో మంచినీటి పైపు లైన్లు మురుగు నీటి కాలువలో ఉన్నాయి. తాగునీటి పైపు లైను పైనుంచి మురుగు ప్రవహిస్తోంది. పైపు లైనుకు లీకు ఏర్పడితే తాగునీరు కలుషితమై ప్రమాదం ఉందని, ఒక్కొక్క రోజు మంచినీరు రంగు మారి రావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పైపులైను మార్చమని అనే సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా మార్పులేదని కాలనీ వాసులు చెబుతున్నారు.

☛ దీనిపై ప్రజారోగ్యశాఖాధికారి శ్రీనివాసరావును న్యూస్‌టుడే వివరణ కోరగా ఖాళీ స్థల యజమానులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

జనాభా 21,500

వార్డులు 8, 9, 10, 11, 12, 13, 14, 15

కుటుంబాలు 4,500


నిడుబ్రోలు వడ్డిముక్కల రోడ్డులో ప్రమాదకరంగా వంతెన


9వ వార్డు.. మురుగు కాలువలో మంచినీటి పైపు లైన్లు

స్కౌట్ విద్యార్థులకు దుస్తుల పంపిణీ

కొల్లిపర, న్యూస్‌టుడే: స్కౌట్ విద్యార్థులకు సుజన సేవాసమితి నిర్వాహకులు దుస్తులు అందజేయటం ముదావహమని ప్రధానోపాధ్యాయులు టి.మల్లేశ్వరరావు అన్నారు. అన్నవరపులంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం నిర్వహించిన వితరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే దేశభక్తి అలవడేందుకు భారత స్కౌట్ దోహదపడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్కౌట్ ఉపాధ్యాయులు మంటాకిరణ్, సర్పంచి తోడేటిరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సోమవారం తన ఛాంబర్లో ఇంజినీర్లతో సమీక్షించారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన

చేబ్రోలు : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తుపదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం పాడుచేసుకోవడంతోపాటు జైలు పాలై జీవితాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. మహిళా శిశు సంరక్షణ శాఖ లీగల్ అడ్వయిజర్ విజయలక్ష్మి, యువజన సర్వీసుల శాఖ మేనేజర్ రాధిక, కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, ఈవోపీఆర్డీ ఉషారాణి పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్ఫూర్తిని పంచే పోలీస్ అమర వీరుల సేవలు చిరస్మరణీయమని డీఎస్పీ బి.జనార్దనరావు పేర్కొన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణ చెంచుపేటలోని దివంగత ఐపీఎస్ అధికారి ఉమేష్ చంద్ర విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. శిక్షణ డీఎస్పీ భార్గవి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు. ఎన్‌సీసీ, ఇతర విద్యార్థులు, యువత మానవహారంగా ఏర్పడి నివాళులు అర్పించారు. తెనాలి రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఎస్సై వెంకటాద్రి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు.


ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డీఎస్పీ, పోలీసులు

రూ.పది నాణేలు తీసుకోవాలి

పొన్నూరు: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు రూ.పది నాణేలను తీసుకోవాలని బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ మోహన్‌కృష్ణ పేర్కొన్నారు. సోమవారం పట్టణ పరిధి జీబీసీ రహదారిలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

తప్పుడు సర్వే నంబరుతో గ్రంథాలయ భూమి స్వాహా

పెదకాకాని: పెదకాకాని గ్రామ కూడలిలోని గ్రంథాలయ భూమిని ఇద్దరు మహిళలు తప్పుడు సర్వే నంబరుతో భవానీ మహిళా ట్రస్టు పేరుపై రిజిస్టర్ చేయించుకున్నారని గ్రామానికి చెందిన పెండ్యాల నాగ సురేష్ సోమవారం జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో ట్రస్టులో ఉన్న సభ్యులకు తెలియకుండా భాగస్వాములను చేశారు. ఈ భూమి తమదే అంటూ పంచాయతీ స్వాధీనం చేసుకునేందుకు యత్నించింది. వివాదం హైకోర్టుకు చేరింది. తప్పుడు పత్రాలతో హైకోర్టును మోసగించి ఆర్డర్ తెచ్చుకున్నారు. శాటిలైటు సర్వే చేసి భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాగసురేష్ తెలిపారు.

పూజలకు కుళ్లిన కొబ్బరి కాయలా?

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మూడు వారాలుగా అభిషేకం, రాహుకేతు వంటి పలు పూజలకు కుళ్లిన కొబ్బరి కాయలు సరఫరా చేస్తున్నారని, దానివల్ల తాను నష్టపోతున్నానని బత్తుల భాస్కరరావు (పాటదారుడు) ఈవో గోగినేని లీలా కుమార్‌కి ఫిర్యాదు చేశారు. దీనిపై ఈవోని వివరణ కోరగా కొబ్బరికాయల దుకాణదారుడికి నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు.

బాణసంచా దుకాణాల అనుమతులకు ఏక గవాక్ష విధానం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: బాణసంచా దుకాణాల ఏర్పాటుకు ఏక గవాక్ష విధానాన్ని అమలు చేయనున్నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో ఏర్పాట్లపై తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ మండలానికి ఆ మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నుంచి ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతాయని, అన్ని అనుమతులు అక్కడే లభిస్తాయని, ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తులు అందుకుంటామన్నారు. శిక్షణ డీఎస్పీ భార్గవి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

నందివెలుగు రైతుకు పురస్కారం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆదివారం నిర్వహించిన వేడుకలో రైతు నేస్తం పురస్కారాన్ని అందుకున్నట్లు తెనాలి మండలం నందివెలుగుకు చెందిన ప్రకృతి సాగు రైతు మీసాల రామకృష్ణ సోమవారం తెలిపారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, రైతు నేస్తం ఎడిటర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ఇతర ప్రముఖులు పురస్కారం అందించినట్లు పేర్కొన్నారు.


పురస్కారం అందుకుంటున్న రైతు మీసాల రామకృష్ణ

అర్జీల పరిష్కారానికి చర్యలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: చినరావూరులోని కొందరు రోడ్డు ఆక్రమించి మురుగు పారుదల కాకుండా అడ్డుకోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు ధన సూర్యావతి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు అర్జీ అందజేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన సమస్యలపై అర్జీలు స్వీకరించారు. స్థానిక యడ్లలింగయ్య కాలనీలో రోడ్డు పై పడిన గుంతలు పూడ్చక ప్రమాదాలు జరుగుతున్నాయని, వర్షపు నీరు మళ్లించక రోడ్డుకు ఇరుపక్కల చేరడంతో ఇబ్బంది పడుతున్నట్లు నాగేశ్వరరావు వాపోయారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో తహసీల్దార్ గోపాలకృష్ణ ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో ఒప్పంద విధానంపై ఉద్యోగం ఇప్పిస్తానని నవీన్ అనే వ్యక్తి రూ.30 వేలు తీసుకుని చెన్నయ్ వెళ్లిపోయాడంటూ పట్టణ వాసి ఫిర్యాదు చేశారు. పెట్రోల్ బంక్‌లో ప్రాథమిక వసతులు ఉండటం లేదని, కేంద్రీయ విద్యాలయం వద్ద రోడు సరిగ్గా లేదని ఇలా మొత్తం ఆరు అర్జీలు వచ్చాయి.

ఏబీవీపీ నూతన కమిటీ ఎన్నిక

ఎ.ఎన్.యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఏబీవీపీ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఏఎన్‌యూ ఇన్‌ఛార్జిగా చింతల మోహన్‌రావు, అధ్యక్షుడిగా సాయి చంద్రిక, ప్రధాన కార్యదర్శిగా వంశీ, ఉపాధ్యక్షులుగా హేమంత్‌రామ్, మణికంఠ, యుగంధర్, సంయుక్త కార్యదర్శులుగా అంబటి వేదశ్రీ, గంగాధర్, వాసును ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మహా సంఘటన్ కార్యదర్శి సుబ్బరాజు మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన కమిటీ విద్యార్థుల సమస్యలపై పోరాడాలని చెప్పారు.

రహదారి మరమ్మతులకు రూ.19 లక్షలు మంజూరు

పొన్నూరు, న్యూస్‌టుడే: మాచవరం గ్రామంలో రోడ్డు భవనాల శాఖ రహదారి గోతులమయంగా మారింది. ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించడానికి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా పాలనలో రహదారి మరమ్మతులకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరమ్మతుల నిమిత్తం రూ.19 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఆ శాఖ సహాయ ఇంజినీరు గోగినేని శ్రీనివాసరావు న్యూస్‌టుడేకు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి మరమ్మతులను పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు.

మహాప్రస్థానం గౌరవ అధ్యక్షుడి మృతికి సంతాపం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి మహాప్రస్థాన సేవా సమితి గౌరవ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ (92) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందినట్లు సమితి కార్యదర్శి శివరామకృష్ణప్రసాద్ తెలిపారు. ఆయన భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు మంగళవారం తెనాలి తీసుకువస్తారని, బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తారని వివరించారు. పలువురు సంతాపం తెలిపారు.

అంతర్జాతీయ ఆర్ట్ గ్యాలరీకి ఎంపిక

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫైన్ ఆర్ట్స్ విభాగం అధ్యాపకులు జాన్ రత్నబాబు గీసిన చిత్రాలు అంతర్జాతీయ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించనున్నారు. నవంబర్ 22 నుంచి 25 వరకు లండన్‌లోని సారాస్ అంతర్జాతీయ గ్యాలరీలో ప్రదర్శన నిర్వహించనున్నారు. 10 దేశాల నుంచి 12 మంది చిత్రకారుల చిత్రాలను ప్రదర్శించనున్నారు. జాన్ రత్నబాబు గీసిన ఐదు చిత్రాలను ఇందులో ప్రదర్శించనున్నారు.

సమస్యలు.. అవస్థలు

జనాభా 12,345

కుటుంబాలు 3,300

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

గత వైకాపా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణంలోని ఉప్పుబజార్, ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంతాల్లో స్థానికులను సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాలకు వెళ్లే బీటీ రోడ్డు గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ కళాశాలకు వెళ్లే రోడ్డులో ఆకతాయులు ఇబ్బందికరంగా ప్రవర్తిస్తున్నట్లు తల్లిదండ్రులు, మహిళలు వాపోతున్నారు. ☛ జయప్రకాష్ నగర్‌లో వేసిన సీసీ రోడ్లకు బరమ్స్ వేయక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ☛ బస్‌స్టేషన్ బయట అన్న క్యాంటీన్ పక్క కాలువ నిర్మించక వర్షపు నీరు సీసీ రోడ్డు పైన ఉంటోంది. ☛ వైశ్య విద్యానిధి, సామ్రాట్ హోటల్ ఎదురు రహదారులపై ఆక్రమణల వల్ల వర్షపు నీరు కాలువల్లోకి పారుదల కాక జలమయమవుతున్నాయి. ☛ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదురు రోడ్డులో వెలిసిన ఆక్రమణలతో కుంచించుకుపోయింది. ఈ ప్రాంతంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న మూత్రశాలలు జనం నిరాదరణకు గురవుతున్నాయి. బస్టాండ్ వెనుక మూత్రవిసర్జన చేయడం పరిపాటి అయింది.

కాలువల్లో పారని మురుగు.. ఉప్పుబజార్‌లో ఆక్రమణల వల్ల వర్షపు నీరు కాలువల్లోకి పారుదల కాదు. రోజూ సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు వాహనాల రాకపోకలతో రద్దీ నెలకొంటుంది. దీని నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. ఈ ఏరియాలో సేకరించిన చెత్తని ఉప్పుబజారు, షరాబజార్‌ల్లో రోడ్డుపై పడేసి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. చెత్త కుప్పలను పందులు, ఆవులు, కుక్కలు చెల్లా చెదురు చేస్తున్నాయి. పురవేదిక వద్ద పెట్టించిన స్టీలు డస్ట్‌బిన్లను కొబ్బరి బొండాలు ఆక్రమించుకుని వాడుకుంటున్నా పట్టనట్టు ఉన్నారు. కాలువలు రోజూ శుభ్రం చేయట్లేదు. చేపలను బాగు చేసేందుకు వాడిన నీరు చేపల మార్కెట్ రోడ్డు పైకి చేరి దుర్గంధం వ్యాపిస్తుండడంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. మార్కెట్ కాంప్లెక్స్ సెల్లార్లో, రెండో అంతస్తులో బహిరంగ మల,మూత్ర విసర్జన చేస్తున్నా నియంత్రించే వారు లేరు.


రంగు మారిన చేతి పంపు నీరు


వీఎస్ఆర్అండ్ ఎన్వీఆర్ కళాశాల రోడ్డు ఇలా..


నాణ్యమైన మందు వాడడం లేదు



ఉప్పుబజార్లో ఫాగింగ్ చేస్తున్నా దోమలు నిర్మూలన కావడం లేదు. నాణ్యమైన మందు వాడడం లేదు. ఈ రోడ్డులోని పల్లపు ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు కాలువల్లోకి మళ్లించక నిలిచి ఉంటుంది. వాహనాల రాకపోకలతో పాదచారులపై పడుతుంది. వీధి కుక్కలు జనం వెంట పడుతున్నాయి.

-మల్లికార్జునరావు, వ్యాపారి

రంగుమారిన నీరు



పట్టణంలోని ఉప్పుబజార్ ఏరియాలోని చేతి పంపుల నుంచి రంగు మారిన నీరు వస్తుంది. గతంలో ఇలా రాలేదు. దీన్నే తాగుతున్నా. ఈ ఇరుకురోడ్లలో ఆటోలు ఎదురెదురు వచ్చినప్పుడు తీవ్ర అసౌకర్యంగా ఉంటుంది.

-ప్రసాద్, ప్రైవేట్ ఉద్యోగి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణ గాంధీచౌక్ మునిస్వామి నాయుడు వీధిలో పురాతన నిర్మాణం వద్ద పిచ్చి మొక్కలు పెరిగి పోయి వాటిల్లో విష కీటకాలు చేరి ఇళ్లలోకి వస్తున్నాయి. **- స్థానికులు, గాంధీచౌక్**

✔ సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కార చర్యలు తీసుకుంటాం. -బి.శేషన్న, మున్సిపల్ కమిషనర్

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

? పట్టణంలోని శాంతినగర్‌లో రహదారి కుంగి వర్షం పడినప్పుడు నీళ్ళు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.

- ఎన్. డేవిడ్, శాంతినగర్.

✔ పల్లంగా ఉన్న రహదారికి మరమ్మతులు చేయిస్తాం.

- అపర్ణ, సహాయ ఇంజినీర్.

? పట్టణ పరిధి జీబీసీ ప్రధాన రహదారిలో మూడు రోజులు నుంచి చెత్త పేరుకుని దుర్వాసన వస్తుంది.

- పి.రామారావు, జీబీసీ రహదారి

✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖ అధికారి.

- న్యూస్‌టుడే, పొన్నూరు

సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. ☛ రైలుపేటలో పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేయించారు. ☛ వీవర్స్‌కాలనీలోని మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు.

-న్యూస్‌టుడే, పొన్నూరు

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

పొన్నూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు సాంకేతిక, సామాజిక నైపుణ్యాలను పెంచుకోవాలని చండీగఢ్ ఎన్ఐటీటీటీఆర్-ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఎమర్జింగ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ మైత్రేయీ దత్త పేర్కొన్నారు. సోమవారం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఔట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ (ఓబీఈ) అండ్ అక్రిడిటేషన్ అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు సబ్జెక్టులు మాత్రమే కాకుండా నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించడానికి ఓబీఈ తోడ్పడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఉపకులపతి పి.నాగభూషణ్ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ పీఎంవీ.రావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మైత్రేయీ దత్త

అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ

పొన్నూరు, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్రను 6వ తరగతి నుంచి ఎంఏ వరకు పాఠ్యాంశంగా పెట్టాల్సిన అవశ్యకత ఉందని దళిత మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తి పద్మారావు పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని ఆయన స్వగృహంలో సోమవారం డాక్టర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఆయన జీవిత చరిత్రను చదవడం వల్ల ప్రాథమిక సూత్రలపై అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కత్తి పద్మారావు తదితరులు

కక్షతో తెదేపా అభిమానిపై దాడి

చేబ్రోలు,న్యూస్‌టుడే: రాజకీయ కక్షలతో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై వెంకట కృష్ణ కథనం మేరకు.. నారాకోడూరుకు చెందిన కొత్తపల్లి శ్రీకాంత్ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెదేపాకు అనుకూలంగా ఉన్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు కృష్ణ అతని కుమారుడు మరో ముగ్గురు కలసి ఆదివారం మధ్యాహ్నం కర్రలతో అతనిపై దాడి చేశారు. గాయపడిన అతన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు, న్యూస్‌టుడే: కుటుంబ సమస్యలతో చేబ్రోలుకు చెందిన వెంకటేష్ అనే వ్యక్తి సోమవారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే గమనించి ఉరి తప్పించి చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వార గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.


విద్యుదాఘాతంతో యువకుడి మృతి

చేబ్రోలు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన ఇది. ఎస్సై వెంకట కృష్ణ కథనం ప్రకారం... బాపట్ల జిల్లా చెరుకుపల్లికి చెందిన మద్దెల రోశయ్య (30) మూడు రోజులుగా వడ్లమూడిలోని తన అక్క నాగలక్ష్మి దగ్గర ఉంటూ చిన్నా అనే వ్యక్తికి చెందిన ఇనుప దుకాణంలోకి పనికి వెళ్తున్నాడు. సోమవారం ఉదయం దుకాణంలో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. స్థానికులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వేజండ్ల విద్యార్థిని ప్రతిభ

చేబ్రోలు, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర 2024 అంశంపై గుంటూరులో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అఫ్రీన్ వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానంలో గెలుపొందింది. విద్యార్థినికి జేసీ భార్గవతేజ, డీఈవో శైలజ చేతుల మీదుగా ప్రశంసాపత్రంతోపాటు రూ.5వేల నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా అఫ్రీన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయశ్రీ, ఇతర ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

చిత్రలేఖనంలోనూ.. : అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సేవ్ గర్ల్ చైల్డ్ అనే అంశంపై జిల్లా స్థాయిలో గుంటూరులో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ నజ్మా ద్వితీయ, వ్యాసరచనలో శివనాగలక్ష్మి తృతీయ స్థానాల్లో గెలుపొందారు. విద్యార్థినులకు సోమవారం జేసీ భార్గవతేజ, డీఈవో శైలజ చేతుల మీదుగా ప్రశంసా పత్రంతోపాటు రూ.3వేల నగదును బహుమతి అందజేశారు. విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.


ఉన్నతాధికారుల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని అఫ్రీన్

సహానాకు కొనసాగుతున్న చికిత్స

నగరపాలెం (గుంటూరు): బ్రెయిన్ డెడ్ అయిన తెనాలి యువతి సహానాకు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స కొనసాగుతోంది. గుండె కొట్టుకునే తీరును నిర్ధారించే, ఇతర పరీక్షలను ఆదివారం వైద్యులు నిర్వహించారు. యువతి కోమాలోనే ఉన్నారు.

గుంటూరు తూర్పు

ముగిసిన స్వర్ణకార సంఘ నామినేషన్ల ప్రక్రియ

పట్నంబజారు, న్యూస్‌టుడే: గంటలమ్మచెట్టువీధిలో సోమవారం గుంటూరు పట్టణ స్వర్ణకార సంఘ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. పఠాన్ మహమూద్ ఖాన్, సయ్యద్ ఇబ్రహీం భాషా రెండు ప్యానల్స్ వారు నామినేషన్లు వేశారు. ఎన్నికల కన్వీనర్లు దివ్య, నారాయణ, కడారు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నామినేషన్ల ప్రక్రియ జరిగింది. సంఘ పెద్దలు చాపల సాయిబాబా, ధనాలకోట శ్రీనివాసరావు, పారేపల్లి మహేష్, షేక్ ఫిరోజ్ బడేబాబు, శంభాన వీరభద్రాచారి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కు ప్రైవేటీకరిస్తే ఉద్యమం తీవ్రం'


మాట్లాడుతున్న హర్షకుమార్, వేదికపై ముప్పాళ్ల నాగేశ్వరరావు, అమృతరాజ్, రాధాకృష్ణమూర్తి, విజయ, మాల్యా

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు ప్రైవేటీకరిస్తామంటే సహించేదిలేదు.. ఉద్యమం తీవ్రతరం చేస్తామని మాజీ ఎంపీ హర్షకుమార్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు సాధనకు ఆమరణ నిరాహారీ దీక్ష చేసిని తాడికొండ మాజీ ఎమ్మెల్యే తమనంపల్లి అమృతరావు 103 జయంతి వేడుక సోమవారం అమరావతిరోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో హర్షకుమార్, ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు చరిత్రను నేటి యువత తెలుసుకోవాలన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు జరిగే పోరాటంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు అమృతరావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, కూచిపూడి విజయ, అమృతరాజ్, మాల్యాద్రి, నాగరాజు, పాల్, శామ్యూల్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయాల తనిఖీ


వివరాలు తెలుసుకుంటున్న ఆర్జేసీ ఆజాద్

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ (ఆర్జేసీ) ఆజాద్ సోమవారం నగరంలో పర్యటించారు. నాజ్‌కూడలిలోని ఆశాఖ జోన్ ఉపకమిషనర్ (డీసీ), జిల్లా సహాయ కమిషనర్ (ఏసీ), మూడు జిల్లాల ఆభరణాల తనిఖీ అధికారి (జేవీవో), డిప్యూటీ ఇంజినీర్ (డీఈ) కార్యాలయాలను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహిస్తున్న తీరు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, ఆర్‌అగ్రహారంలోని నరసింహస్వామి ఆలయాన్ని తనిఖీ చేశారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గతంలో పనిచేసిన ఓ పాలకమండలిపై వచ్చిన అభియోగాలపై విచారించారు. నరసింహస్వామి ఆలయంలో శిథిలావస్థలో ఉన్న గోడలను కూల్చివేసి నూతనంగా నిర్మించాలన్నారు. ఆర్జేసీ వెంట డీసీ కేబీ శ్రీనివాస్, జేవీవో శ్రీనివాసరావు, ఏసీ మాధవి ఉన్నారు.

మీరిచ్చే గౌరవం ఇదేనా?

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సోమవారం అమర వీరుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతియేటా అక్టోబర్ 21న జరిగే కార్యక్రమానికి హాజరవ్వాలని జిల్లాలోని అమరవీరుల కుటుంబ సభ్యులకు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు ముందస్తు సమాచారం అందిస్తారు. అలాంటిది ఈ యేడాది పలువురికి తెలియజేయలేదని ఆ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. స్తూపం వద్ద ఉన్న పోలీసు ఉన్నతాధికారులను తమను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. 'హెడ్ కానిస్టేబుళ్లు మోహన్‌రావు, గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ గౌరీశంకర్ మావోయిస్టుల దాడితో అమరులయ్యారు. వారి కుటుంబ సభ్యులను పిలవలేదని ఆవేదన చెందారు. మేం ఏడాది మొత్తం అక్టోబర్ 21 కోసం ఎదురు చూస్తూ ఉంటాం. ఆ రోజు పోలీసు అధికారులు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని మా వాళ్లకు నివాళులర్పించడం మాకు ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తాం. అధికారులు కనీసం ఒక్క ఫోన్ చేసి పిలవకపోవడం చాలా బాధకలిగించింద'ంటూ కన్నీళ్ల పర్యంతమయ్యారు. వెంటనే అక్కడ ఉన్న ఏఎస్పీ సుప్రజ వారిని ఓదార్చారు. ఎస్పీ సతీష్ కుమార్ మరోసారి అలా జరగకుండా చూస్తామని వారికి భరోసా కల్పించారు.

కన్నెత్తి చూడరు.. సమస్యలు పట్టించుకోరు!

ఇబ్బందుల్లో లాలాపేట వాసులు

పట్నంబజారు, న్యూస్‌టుడే

లాలాపేట నూకాలమ్మ అమ్మవారి గుడిసెంటర్ పరిసర ప్రాంతవాసులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. అధ్వానంగా మారిన రోడ్లు, తాగునీటి ఎద్దడి, ఇళ్ల మధ్య పేరుకుపోయిన వ్యర్థాలు, వెలగని వీధి దీపాల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యల్ని పరిష్కరించేందుకు అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. పైపు లైను కాలువల్లో ఉన్న కారణంగా తరచూ కలుషిత నీరు సరఫరా అవుతుందని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు కలుషిత నీరు తాగి రోగాల బారిన పడ్డారు.

అధ్వానంగా రోడ్లు..

నూకాలమ్మ గుడిసెంటర్, కింగ్స్ హోటల్ పక్కరోడ్డు, చౌత్రాసెంటర్‌కు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. పైపు లైన్ల నిర్మాణం కోసం రోడ్లపై తవ్వకాలు చేసి వదిలేశారు. గుంతల కారణంగా వాహనదారులు, గృహవాసులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.


లాలాపేట: గృహాల మధ్య పేరుకుపోయిన వ్యర్థాలు


కింగ్స్ హోటల్ పక్కన రోడ్డులో కాలువలో తాగునీటి పైపులు

తాగునీటి కష్టాలు

వారంలో రెండు రోజులు తాగునీరు సరఫరా అవ్వడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొందరు తాగునీటి సమస్యను అధిగమించేందుకు వాటర్ క్యాన్లు కొనుగోలు చేసి కాలం నెట్టుకొస్తున్నారు.

కలుషిత నీటితో ఇబ్బందులు

చుట్టు పక్కల ప్రాంతాల్లో తరచూ కలుషిత నీరు సరఫరా అవుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో ఆనందపేటలో కలుషిత నీరు తాగి ముగ్గురు మృతిచెందారు. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఇళ్ల ముందు మురుగు



ఈ ప్రాంతంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వర్షాలు కురిసిన సందర్భాల్లో ఎగువ ప్రాంతాల్లోని మురుగు కొట్టుకొచ్చి ఇళ్ల ముందు చేరుతోంది. రోడ్ల ఎత్తు పెంచి నిర్మిస్తేగాని సమస్య పరిష్కారం కాదు. **- కరీముల్లా**

స్వచ్ఛమైన నీరు సరఫరా చేయాలి



కింగ్స్ హోటల్ పక్కన రోడ్డు, లాలాపేట చుట్టు పక్కల ప్రాంతాల్లో తరచూ కలుషిత నీరు సరఫరా అవుతుంది. తాగునీటి పైపులు కాలువల్లో లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలి. **- బాషా**

ధర వరలు



ఎన్‌టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 38, వంగ 24, బెండ 37, పచ్చిమిర్చి 39, కాకర 30, క్యారెట్ 46, క్యాలిఫ్లవర్ 38, క్యాబేజీ 28, బీర 29, దొండ 26, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 38, గోరుచిక్కుళ్లు 28, దోస 34, పొట్ల 32, మునగ 8, పెద్ద చిక్కుళ్లు 74, చామదుంప 36, మునగ రూ.8, ంగూర 10, తోటకూర 20, కొత్తిమీర 30, బీట్‌రూట్ 33, కీర 24, క్యాప్సికం 64, అల్లం 70, ఫ్రెంచి బీన్స్ 94, సొర 16, అరటి 7 **-న్యూస్‌టుడే, పట్నంబజారు**

పని సర్దుబాటులో నిర్లక్ష్యం

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ విభాగంలో ఇటీవల బదిలీల్లో భాగంగా పలువురు అధికారులు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఇక్కడకు కొత్త అధికారులు వచ్చారు. వీరికి పని సర్దుబాటు చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. గత సోమవారం 14వ తేదీనే కమిషనర్ శ్రీనివాసులు పని సర్దుబాటు చేయాలని ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావుకు ఆదేశాలిచ్చినా అమలుకు నోచుకోలేదు. తాత్కాలికంగా విధుల్లో ఉన్న ఏఈలు, డీఈలు అందుబాటులో లేకపోవడంతో తాగునీటి సరఫరా, ఇతర సమస్యలు ఎవరికి తెలియజేయాలో కూడా తెలియని పరిస్థితి. డివిజన్‌లు, రిజర్వాయర్‌ల వారీగా అధికారులకు వెంటనే కేటాయించాలని పలువురు కోరుతున్నారు. పూర్తిగా బాధ్యతలు స్వీకరిస్తేనే అభివృద్ధి పనులు వేగవంతం కావడంతోపాటు పాటు స్థానిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

మహిళలకు ఉచిత శిక్షణ

ఎస్వీఎన్ కాలనీ(గుంటూరు): గుంటూరు యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ మహిళలకు నవంబరు 5 నుంచి బ్యూటీపార్లర్, జర్దోసి, మగ్గం వర్క్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ సంచాలకుడు జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు హాజరయ్యే మహిళలకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 0863-2336912, 97006 87696, 81253 97953 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిర్ణీత గడువులో ఫిర్యాదుల పరిష్కారం


అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ ఓబులేసు


నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చే అర్జీలు, ఫిర్యాదులు నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ ఓబులేసు ఆదేశించారు. సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక 11, ఇంజినీరింగ్ 9, రెవెన్యూ 2, ప్రజారోగ్యం 5, అకౌంట్స్ 1, ఉపాసెల్ 1 చొప్పున ఫిర్యాదులు అందాయని తెలిపారు. అర్జీలను ఆయా విభాగాల అధికారులకు పంపి నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఏసీ మాట్లాడుతూ.. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదు దారులకు సమాచారం ఇవ్వాలన్నారు. డీసీలు సీహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సీపీ రాంబాబు, ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు, మేనేజరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ప్రాధాన్యం పెంచేందుకు కృషి


విద్యార్థికి మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే నసీర్

నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ముస్లిం మైనారిటీ విద్యార్థులకు మేలు చేకూర్చేలా సీఎం చంద్రబాబునాయుడు చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. సోమవారం పొన్నూరురోడ్డు చంద్రబాబునాయుడు కాలనీ మొదటిలైన్‌లోని మజాహిరుల్ ఉలూమ్ మదర్సాలో నూతన పథకం తీసుకురావడంపై కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ.. ఉర్దూ ప్రాధాన్యత పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకంలో భాగంగా ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయులు, వాలంటీర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 185 మదర్సాలకు ముగ్గురు చొప్పున 555 మంది వాలంటీర్లను నియమించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు. కార్యక్రమంలో మదర్సా పెద్దలు మౌలానా ఫేజుల్లా, మైనారిటీ నాయకులు పఠాన్ జమీర్, ఉస్మాన్, రఫీ, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంతో రావాలి


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కృష్ణ-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించినందుకు మాజీ మంత్రి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సోమవారం సచివాలయంలో చంద్రబాబును కలిసి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రెండు ఉమ్మడి జిల్లాల్లోని 33 నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, పరిధిలోకి వచ్చే ఎంపీలను సమన్వయం చేసుకుంటూ సమష్టిగా పని చేసి విజయం సాధించాలని చంద్రబాబు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని, అర్హులైన వారి అందరి ఓట్లు చేర్పించాలన్నారు. కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, రాష్ట్ర బ్రాహ్మణ సాధికార అధ్యక్షుడు బుచ్చిరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వేడుకోలు


అర్జీలు నమోదు చేస్తున్న పోలీసు సిబ్బంది


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రమణమూర్తి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి బాధితులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ సుబ్బారావు, రమేష్ ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశించారు.

అబ్బాయి మృతికి కారకులను శిక్షించండి


మణికంఠ కుటుంబ సభ్యులు

మా కుమారుడు మణికంఠ ఐటీఐ చదివి పాలకంపెనీలో ఫిట్టర్‌గా పనిచేశాడు. అదే కంపెనీలో చేసే అశోక్, అతని స్నేహితురాలికి గొడవలు వచ్చాయి. మా అబ్బాయి సెల్ తీసుకొని అశోక్ ఆ అమ్మాయికి ఫోన్ చేస్తుండేవాడు. ఈక్రమంలో సెప్టెంబర్ 24న మా అబ్బాయి ఇంట్లో చీరతో ఉరివేసుకొని వేలాడుతూ ఉన్నాడు. మాబాబును చంపి అలా వేలాడతీశారు. వారిని శిక్షించాలి. **-తల్లిదండ్రులు దాసు, మేరీ**

చర్యలు తీసుకోవాలి



ఈ నెల 14న ఓ ద్విచక్ర వాహనదారుడు తన వాహనంతో ఢీకొట్టడంతో నా తమ్ముడు తేజకి గాయాలయ్యాయి. ప్రమాదం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడంలేదు.

-నరేంద్ర, నెహ్రూనగర్

పోలీసుల దురుసు ప్రవర్తన



నా భర్త వేరే మహిళతో సాన్నిహిత్యంగా మెలుగుతూ నన్ను వేధిస్తున్నాడు. అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయకుండా నాపైనే దురుసుగా మాట్లాడుతున్నారు.

-ఇన్నాసమ్మ, ఫిరంగిపురం

బంగారం, నగదు స్వాహా



నాకు ఆరోగ్యం బాగోలేదు. మా బంధువుల అబ్బాయి వెంకటేశ్వర్లు మాయమాటలు చెప్పి రూ.30 లక్షల నగదు, 10 సవర్ల బంగారం తీసుకొని ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు.

-రామయ్య, పొన్నూరు

రూ.2 లక్షలు తీసుకొని ఇవ్వడంలేదు

పక్షవాతంతో నడవలేకుండా ఉన్నా. నేను దాచుకున్న రూ.2 లక్షలు అశోక్ అనే వ్యక్తి తీసుకొని తిరిగి ఇవ్వకుండా 8 ఏళ్లుగా ఇబ్బంది పెడుతున్నాడు. **-పున్నమ్మ, ఆర్ అగ్రహారం**

ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయ నియామకం నిలిపివేత

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలోని రాహుల్‌గాంధీనగర్‌లో ఉన్న శ్రీరాఘవేంద్ర ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం నిలిచిపోయింది. పాఠశాలలో ఉపాధ్యాయ భర్తీ కోసం గతేడాది అక్టోబరు 10న హైకోర్టు నుంచి పాఠశాల కమిటీ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. కోర్టు ఉత్తర్వులమేరకు నాలుగు పోస్టులు మంజూరు చేయగా వీటి భర్తీకి పత్రిక ప్రకటన ఇచ్చారు. ఈ ఏడాది మార్చి 2న పాఠశాలలో విద్యార్థులులేరని, బోగస్ హాజరు వేస్తున్నారని, మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలు జరుగుతున్నాయని డీఈవోకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 21న ఉపవిద్యాశాఖాధికారి విచారణ చేసి ఫిర్యాదులో వచ్చిన విషయాలు వాస్తవాలేనని నిర్ధారిస్తూ నివేదిక ఇచ్చారు. కానీ పాఠశాల కరస్పాండెంట్ త్రిమెన్ కమిటీని మేనేజ్ చేసి మూడు ఉపాధ్యాయుల పోస్టులకు కోర్టు నుంచి అనుమతి పొందారు. దీన్ని సవాలు చేస్తూ ఆర్జేడీ, జిల్లా కలెక్టర్‌కు మరోమారు స్థానికులు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో విద్యార్థులు లేరని, ఉపాధ్యాయ పోస్టులు రూ.లక్షలకు అమ్ముకున్నారని ఫిర్యాదులో తెలియజేయడంతో వారు విచారించారు. వివరాలను ప్రభుత్వం నుంచి ఏపీ హైకోర్టుకు నివేదించడంతో శుక్రవారం కంటెంప్ట్ కేసు కొట్టివేస్తూ నియామకాలు రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. విషయాన్ని 'న్యూస్‌టుడే' డీఈవో శైలజ దృష్టికి తీసుకెళ్లగా కంటెంప్ట్ కేసు న్యాయస్థానం కొట్టేసిందని ఉపాధ్యాయ భర్తీ ఆగిందని తెలిపారు.

నగరంలో పోలీసుల ర్యాలీ


చెక్కులు అందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారి త్యాగాలను స్మరించుకుంటూ సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ సతీష్ కుమార్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఎస్పీతోపాటు ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం


ర్యాలీలో ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీలు, డీఎస్పీలు, సిబ్బంది

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అమరవీరులైన పోలీసుల కుటుంబాలకు అన్నివేళలా అండగా ఉంటామని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం పోలీసు కార్యాలయంలో అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు కుటుంబ సభ్యులకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదిస్తే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలకు ఆర్థికసాయంగా నగదు చెక్కును అందించారు. ఏఎస్పీలు రమణమూర్తి, హనుమంతు పాల్గొన్నారు.

సహానాకు కొనసాగుతున్న చికిత్స

నగరపాలెం (గుంటూరు), న్యూస్‌టుడే: బ్రెయిన్ డెడ్ అయిన తెనాలి యువతి సహానాకు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స కొనసాగుతోంది. గుండె కొట్టుకునే తీరును నిర్ధారించే, ఇతర పరీక్షలను ఆదివారం వైద్యులు నిర్వహించారు. యువతి కోమాలోనే ఉన్నారు.

బంగారు గొలుసు చోరీ

పట్నంబజారు, న్యూస్‌టుడే: రోడ్డుపై వెళ్తున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని యువకుడు బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. లాలాపేట పోలీసుల కథనం ప్రకారం.. ఇందిరా ప్రియదర్శినికి చెందిన బొమ్మారెడ్డి పద్మావతి సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి రోడ్డుపై వెళ్తుండగా ఆమె వెనుకగా ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడు బంగారపు గొలుసు లాక్కుని పరారయ్యాడు. రూ.2లక్షలు విలువ చేసే బంగారపు గొలుసు చోరీకి గురైందని బాధితురాలు లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన నాయకుడికి దేహశుద్ధి

పట్నంబజారు, న్యూస్‌టుడే: తూర్పు నియోజకవర్గ పరిధి ఓ పార్టీ డివిజన్ అధ్యక్షుడిని మహిళలు దాడి చేసి తీవ్రంగా కొట్టారు. సోమవారం ఒక మహిళ స్నానం చేస్తుండగా బాత్‌రూంలోకి వెళ్లి చూశాడని, విషయం తెలుసుకున్న స్థానిక మహిళలు అక్కడికి చేరుకొని అతనికి దేహశుద్ధి చేశారు. ఈ విషయమై పాత గుంటూరు పోలీసులను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఉచిత బస్సు ప్రయాణ హామీ అమలుకు డిమాండ్



ప్రయాణికుల సంతకాల సేకరణలో మస్తాన్‌వలీ, విజయ్‌కుమార్ తదితరులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ హామీని తక్షణమే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలీ డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గుంటూరు ఆర్టీసీ బస్టాండు నుంచి తెనాలి వరకు బస్సులో ప్రయాణించి ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు గురించి అడిగి తెలుసుకున్నారు. తొలుత గుంటూరు ఆర్టీసీ బస్టాండులో ప్రయాణీకుల నుంచి సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌కు టోకరా.. జిరాక్స్ నోట్లతో మోసం

ఒంగోలు నేరవిభాగం: జిరాక్స్ నోట్లతో కారు డ్రైవర్‌కు టోకరా ఇచ్చాడో వ్యక్తి. ఈ సంఘటన ప్రకాశం జిల్లా ఒంగోలులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గుంటూరుకు చెందిన వెల్లాల శ్రీనివాసరావు కారు డ్రైవర్. ఆయన వద్దకు సోమవారం సాయంత్రం ఓ వ్యక్తి వచ్చి కారు బాడుగకు కావాలని అడిగాడు. రేటు మాట్లాడుకున్న శ్రీనివాసరావు అతన్ని తీసుకుని ఒంగోలు వచ్చాడు. ఒంగోలులో ఒక రెస్టారెంట్‌కు వెళ్లిన సదరు వ్యక్తి తనతో పాటు డ్రైవర్‌ను తీసుకెళ్లారు. అక్కడ డ్రైవర్ శ్రీనివాసరావుతో మాట్లాడుతూ తనకు రూ.ఏడువేలు ఫోన్ పే చేయాలనీ, దానికి తాను నగదు ఇస్తానని నమ్మబలికాడు. దీంతో డ్రైవర్ శ్రీనివాసరావు ఆ వ్యక్తి చెప్పిన నంబర్‌కు నగదు పంపారు. దీంతో ఆ వ్యక్తి శ్రీనివాసరావుకు 14 రూ.500 నోట్లు ఇచ్చాడు. ఒక్క కాల్ చేసుకుని వస్తా నీ ఫోన్ ఇవ్వమని అడగటంతో శ్రీనివాసరావు మరో ఆలోచన లేకుండా తన సెల్‌ఫోన్ సదరు వ్యక్తికి ఇచ్చాడు. కాసేపటి తర్వాత ఫోన్ మూగబోయింది. ఏం జరిగిందని బాధితుడు ఆరాతీస్తే తనకు సదరు వ్యక్తి ఇచ్చిన నోట్లు జిరాక్స్ అని తెలిసింది. దీంతో బాధితుడు శ్రీనివాసరావు ఒంగోలు ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు.

ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల స్నేహ సంబంధాలతో మెరుగైన ఫలితాలు


తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


యలమంచిలి శివాజీని కలిసిన మంత్రి తుమ్మల

గుంటూరు (పట్టాభిపురం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల మధ్య స్నేహ సంబంధాలతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతు నాయకుడు, మాజీ ఎంపీ యలమంచలి శివాజీని గుంటూరులోని నివాసంలో సోమవారం ఆయన కలిసి పరామర్శించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. 'రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య మంచి అవగాహన ఉంది. ముఖ్యమంత్రుల భేటీ తర్వాత అధికారులతో కమిటీ వేయాలని నిర్ణయించారు. ఈ కమిటీ ద్వారా ఇరు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుంది. భద్రాచలం ఎగువన ఉన్న ఐదు గ్రామాలను పరిపాలన దృష్ట్యా తెలంగాణలో కలపమని కోరుతున్నాం. ఇంకా కొలిక్కి రాని అంశాలుంటే.. చర్చల ద్వారా పరిష్కారమవుతాయి. గత వైకాపా ప్రభుత్వం తితిదేలో శ్రీవారి దర్శనం కోసం తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను రద్దు చేసింది. వీలైతే సిఫార్సు లేఖలను పునరుద్ధరించాలి. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విపరీతంగా ఉంది. పామాయిల్ వినియోగం దేశ వ్యాప్తంగా పెరిగింది. ఉత్తరాంధ్రలో కూడా ఆయిల్‌పామ్ పంట కొంత మేరకు సాగు చేస్తున్నారు. ఆయిల్ వినియోగం పెరగడంతో పలు రకాల పంటల సాగు ప్రారంభించారు. ఆయిల్‌పామ్ పంటకు మద్దతు ధర రూ.20,000 ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశాం. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను ఆదుకోవాలని చూస్తున్నారు. రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇప్పటికే రూ.18,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం'.. అని వివరించారు.

తవ్వారు.. వదిలేశారు





పాత గుంటూరులోని ఆంజనేయస్వామిగుడి పక్కన రోడ్డు అధ్వానంగా మారింది. రెండు నెలల కిందట సిమెంటు రోడ్డు నిర్మాణం చేసేందుకు అధికారులు శంకుస్థాపన చేశారు. పనుల్లో భాగంగా రోడ్డు మధ్యలో తవ్వకాలు చేసి వదిలేశారు. రోడ్డంతా బురద ఉండడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చేసేదేమీ లేక బురదలో నుంచే రాకపోకలు కొనసాగిస్తున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా ఎటువంటి ప్రయోజనం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి నిలిచిపోయిన అభివృద్ధి పనుల్ని వేగవంతం చేయాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పట్నంబజారు

గుంటూరు పశ్చిమ

ఉత్సాహం.. ప్రతిభకు ప్రోత్సాహం

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే : స్థానిక మల్లారెడ్డిన గర్‌లోని ది సెంట్రల్ స్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై జరిగిన వ్యాసరచన పోటీల్లో పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ఎం.రేణుక యశస్విని (ప్రథమ), టి.లాస్య (ద్వితీయ), ఎ.రక్షిత గ్రేస్ (తృతీయ) స్థానాలు సాధించారు. వీరికి స్కూల్ డైరెక్టర్ రామచంద్రరావు, ప్రధానోపాధ్యాయులు జ్ఞానశ్రీ, ప్రశంసా పత్రాలను అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మప్రియ, మస్తాన్‌వలి, సుజాత పాల్గొన్నారు.

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే : స్థానిక శ్రీవిజేత హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పి.మంగన్, షేక్ అర్షియా, షేక్ ఖాజాకరీం విజేతలుగా నిలిచారు. స్కూల్ డైరెక్టర్ శ్రీహరి, ప్రధానోపాధ్యాయుడు అన్నపూర్ణ, ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలు అందించి, అభినందించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్కూల్ డైరెక్టర్ రామచంద్రరావు, హెచ్‌ఎం జ్ఞానశ్రీ తదితరులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్కూల్ డైరెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపల్ అన్నపూర్ణ తదితరులు

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే : స్థానిక టీజేపీఎస్ కళాశాల 25 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కాడెట్స్ 'బి' సర్టిఫికెట్లకు సంబంధించిన పరీక్షల్లో 19 మంది హాజరైతే అందరూ ఉత్తీర్ణత సాధించారని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అనితాదేవి తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, కళాశాల అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాంసుందర్, పాలకమండలి సభ్యుడు నాగ సుందరం అభినందించారు. ఎన్‌సీసీ అధికారి మేజర్ పి.కుమార్ రాజా, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సుమేధలో బాలోత్సవ్ వేడుకలు ప్రారంభం

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే : స్థానిక ఎన్‌జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్‌లో సోమవారం బాలోత్సవ్-7 వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు నగరపాలక సంస్థ ఎంహెచ్‌వో జె.రామారావు, మాజీ ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ డి.తిరుపతిరెడ్డి, చిల్డ్రన్ సైకాలజిస్ట్, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ మురుగుడి శ్రీహరి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ చిన్నారుల్లో ఉన్నత ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి, శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బాలబాలికలకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

దీపావళి నుంచి మహిళలకు మహాశక్తి పథకం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: సూపర్ సిక్స్ పథకాల అమల్లో భాగంగా దీపావళి నుంచి మహిళలకు మహాశక్తి పథకం కింద ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందజేసే కార్యక్రమానికి ఎన్డీఏ ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. 'గత వైకాపా ప్రభుత్వం రూ.వేల కోట్లు అప్పులు చేసి ఖజానా ఖాళీ చేసినప్పటికీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలకు ఇచ్చిన వాగ్దానం మేరకు సంక్షేమ పథకాలను ఒక్కొక్కటీ అమలు చేస్తున్నారు. మహాశక్తి పథకం వల్ల ఏడాదికి రూ.3000 కోట్లు భారం పడుతున్నప్పటికీ లెక్క చేయకుండా దీపావళి నుంచి ఈ పథకాన్ని అమలు చేయబోతున్నారు. 1.40 లక్షల మంది లబ్ధిదారులకు మేలు చేకూరుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా సాధికారతకు డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు బాటలు వేశారు. తెదేపా ఆవిర్భావం నుంచి మహిళలకు పెద్దపీట వేస్తుంది. అన్న ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారు. చట్టసభల్లో స్థానం కల్పించారు'.. అని గుర్తు చేశారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 'విధి నిర్వహణలో ఎంతో మంది పోలీసులు ప్రాణాలు కోల్పోతున్నారు. వారి త్యాగాలు మరువలేనివి'.. అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారి సేవల్ని స్మరించుకుంటూ నివాళులర్పించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల ఆత్మకు శాంతి చేకూరాలన్నారు.

ధర వరలు



పట్టాభిపురం, న్యూస్‌టుడే: కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో) టమాట 38, వంగ 24, బెండ 37, పచ్చిమిర్చి 39, కాకర 44, క్యారెట్ 46, బీర 44, క్యాబేజి 28, దొండ 26, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 38, గోరుచిక్కుళ్లు 28, దోస 34, సొర 26, పొట్లకాయ 32, అరటికాయ 7, బీట్‌రూట్ 34, క్యాప్సికం 65, కీరదోసకాయ 24, కొత్తిమీర 25, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 45, అల్లం 70, వెల్లుల్లి 340.

సమస్యలతో సహవాసం

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే

గుంటూరు నగరంలోని ప్రధానమైన 29వ డివిజన్‌లో ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఈ డివిజన్‌లో రామిరెడ్డినగర్, మల్లారెడ్డినగర్, మహబూబ్‌నగర్ పార్టు, చైతన్యనగర్, భవానీపురం, న్యూజూట్‌మిల్ కాలనీ, నల్లకుంట ప్రాంతాలున్నాయి. సుమారు 30 వేల మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. ఇక్కడ చాలా మంది అధికారులు, ఉద్యోగులు నివసిస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చాలా మంది ఇక్కడ స్థలాలు కొనుగోలు చేసి ఖాళీగా వదిలేయడంతో వాటిలో జమ్ము, పిచ్చి మొక్కలు, కంప చెట్లు పెరిగాయి. రాత్రి వేళల్లో విషపురుగులు, సర్పాలు తిరుగుతున్నాయి. దోమలు, కుక్కల బెడద ఎక్కువగా ఉంది. నల్లకుంట, భవానీపురం, న్యూజూట్‌మిల్ కాలనీ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు సరిగా లేవు. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మల్లారెడ్డినగర్‌లో సీసీ రహదారి నిర్మించి రెడ్డి కాలేజీ దగ్గర పనులు సగంలోనే ఆపివేశారు.



భవానీపురంలో రహదారి పల్లంగా ఉండడంతో నిలిచిన వర్షపునీరు



రెడ్డికాలేజి పక్కన డ్రెయిన్ దగ్గర పరిస్థితి ఇదీ..



రహదారిపైనే మిర్చియార్డు ఎదురుగా చేపలు అమ్మకాలు

ముక్కు మూసుకోవాల్సిందే

ప్రతి ఆదివారం మిర్చియార్డు ఎదురుగా చేపలు అమ్ముతుంటారు. దీంతో రహదారిపై రాకపోకలకు అంతరాయం కలుగుతుంటుంది. చేపలను చేపలను శుభ్రం చేసి రెడ్డి కాలేజీ దగ్గర డ్రెయిన్‌లో చెత్తను పడేయడంతో మురుగు ముందుకు కదలక దుర్గంధం వెదజల్లుతోంది. ఆ మార్గంలో ప్రయాణించాలంటే ముక్కు మూసుకోవల్సిన పరిస్థితి.

☛ భవానీపురం చర్చి దగ్గర కొత్తగా నిర్మించిన రహదారి ఎత్తుగానూ.. దాని ఎదురుగా ఉన్న భవానీపురం 3వలైన్ రహదారి పల్లంగా ఉండడంతో వర్షం వచ్చినప్పుడు నీరు నిలిచి తటాకాలను తలపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. భవానీపురం, నల్లకుంట ప్రాంతాల్లో సైడ్ కాలువలు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మురుగు నిల్వ ఉండడంతో దుర్వాసనతో పాటు దోమల కారణంగా తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-2 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 22వ తేదీన విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ గురవయ్య తెలిపారు. దీనివల్ల మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బ్రాడీపేట 2/21 లైను నుంచి 4/21 లైను వరకు, జగన్మోహన్ రైస్ మిల్లు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

వాలంటీర్లను కొనసాగించాలని నిరసన

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వాలంటీర్లను కొనసాగించాలని కోరుతూ వాలంటీర్ల సంఘం, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐవైఎఫ్ నాయకులు, వాలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య మాట్లాడుతూ కరోనా సమయంలో వాలంటీర్లు అందించిన సేవలను దృష్టిలో ఉంచుకుని వారిని కొనసాగించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను కూడా విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజేష్, వెంకట్, నాగరాజ్, రమేష్, బాజీ, నజీర్, తిరుపతమ్మ, బిందు తదితర్లు పాల్గొన్నారు.

రాంసాయికి అభినందన

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఈ నెల 17, 19 తేదీల్లో గుంటూరు బీఆర్ స్టేడియంలో నిర్వహించిన అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ పోటీల్లో హిందూ కళాశాల జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి జె.రాం సాయి ప్రతిభ కనబర్చి ప్రశంసలందుకున్నాడు. ఈ పోటీలకు జిల్లా తరపున రాంసాయి పాల్గొని టేబుల్ వాల్ట్, ఫ్లోర్, పామెల్ హార్సిలలో ప్రథమ తృతీయ స్థానాలు పొందడంతో పాటు ఓవరాల్‌గా కూడా తృతీయ స్థానాన్ని సాధించి రాష్ట్ర జట్టులోకి ఎంపికయ్యాడు. దీంతో జాతీయ స్థాయిలో జరిగే అంతర్రాష్ట్ర పోటీలకు అర్హత సంపాదించాడు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో యాజమాన్యం, ప్రిన్సిపల్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం రాంసాయిని అభినందించారు.




రాం సాయిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్ తదితరులు



విజేతలకు బహుమతుల ప్రదానం

అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఈ నెల 11న ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆడపిల్లలను రక్షించండి అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు జేసీ ఎ.భార్గవ్ తేజ కలెక్టరేట్‌లో బహుమతులు సోమవారం అందించారు. ప్రతి విభాగంలో మొదటి బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు చొప్పున అందించారు

\- న్యూస్‌టుడే, కలెక్టరేట్(గుంటూరు)



చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించి రావాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కృష్ణ-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించినందుకు మాజీ మంత్రి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సోమవారం సచివాలయంలో చంద్రబాబును కలిసి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రెండు ఉమ్మడి జిల్లాల్లోని 33 నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, పరిధిలోకి వచ్చే ఎంపీలను సమన్వయం చేసుకుంటూ సమష్టిగా పని చేసి విజయం సాధించాలని చంద్రబాబు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని, అర్హులైన వారి అందరి ఓట్లు చేర్పించాలన్నారు. కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, రాష్ట్ర బ్రాహ్మణ సాధికార అధ్యక్షుడు బుచ్చిరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణకు ప్రత్యేక శిబిరాలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకమైనా.. బ్యాంకు ఖాతా తెరవాలన్నా.. ఏ ఇతర అవసరాలకైనా ఆధార్ తప్పనిసరి. ఆధార్ కార్డు పొంది చాలా సంవత్సరాలు అయినవారు విశిష్ట గుర్తింపు సంఖ్యను నవీకరించుకోవాల్సిన అవసరముంది. ఇప్పటికే ప్రభుత్వం పలుమార్లు ఆధార్ నవీకరణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నా చాలా మంది పట్టించుకోవడం లేదు. జిల్లాలో చాలా మంది ఆధార్ నవీకరించుకోవాల్సి ఉంది. ప్రధానంగా విద్యార్థుల ఆధార్ నవీకరణకు ప్రస్తుతం ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టింది.

విద్యార్థులకు అందుబాటులో శిబిరాలు: అత్యవసరమైన సమయంలో ఆధార్‌ను నవీకరించుకునేందుకు పరుగులు తీస్తుంటాం. ముఖ్యంగా పిల్లల ఆధార్ విషయంలో అత్యవసరమైన సమయంలో పాఠశాలను మాన్పించి పరుగులు తీస్తుంటారు. ప్రభుత్వం విద్యార్థుల ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు వీలుగా ప్రస్తుతం శిబిరాలు ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఆర్ఐవో, డీఈవో, ఐసీడీఎస్ పీడీలకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించే ప్రదేశాలను ఎంపిక చేయాలని సూచించారు. ఈ మేరకు అధికారులు శిబిరాల నిర్వహణ వివరాలను ముందుగానే విద్యార్థులకు తెలియజేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో 110 వరకు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అందులో ప్రస్తుతం 84 కేంద్రాలు ప్రత్యేక శిబిరాల నిర్వహణకు సిద్ధం చేశారు. అక్టోబర్ 22 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

జిల్లాలో ఆధార్ నవీకరణ చేసుకోవాల్సిన వారి వివరాలిలా..

సంవత్సరం	నవీకరించుకోవాల్సిన వారు..
5–15	81,651
15–17	1,20,381
18+	2,02,032

మూగజీవి రోదన వినేదెవరు?

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: ఎన్‌జీవో కాలనీలో ఒక ఆవుదూడ కాలు విరిగి మూడు రోజులుగా నడవలేక నరకయాతన పడుతోంది. స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం మీకు తోడుగా'కు సోమవారం ఫోన్ చేసి తెలపడంతో బ్లూక్రాస్ వారికి సమాచారం తెలియజేయగా.. వారు '1962' పశుసంవర్థక శాఖ అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. డాక్టర్ రమ్య వచ్చి వైద్యం చేశారు. తర్వాత ఆవుదూడను వెంగళాయపాలెంలోని గోశాలకు తరలించారు. అయితే అధికారులు చెబితేనే గోశాల లోపలకు రానిస్తామని అభ్యంతరం చెప్పారు. జీఎంసీ అధికారిని ఫోన్ చేసి అడిగితే.. గోశాలలోని ఆవుల మధ్యలో ఇది ఉండలేదని, చనిపోతే చాలా ఇబ్బందని, ఇలా ఏవో సాకులు చెబుతున్నారని బ్లూక్రాస్ సభ్యుడు సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. పశుసంవర్ధ శాఖ అధికారులకు చేస్తే వారు ఆవుకు సంబంధించిన వైద్యం మాత్రమే చేస్తాం.. మిగతాది మీరే చూసుకోవాలని తెలిపారన్నారు. దీంతో మూగ జీవి రోదన వినేవారు లేకపోయారు. మూగజీవులను రక్షించేందుకు షెల్టర్లను ప్రభుత్వమే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.



ఆవుదూడకు సపర్యలు చేస్తున్న బ్లూక్రాస్ సభ్యులు

జెండా గుర్తుకే ఓటేయాలని ప్రచారం

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: రైల్వే కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడుతున్న మజ్దూర్ యూనియన్ గుర్తు జెండాకే ఓటేయాలని ద.మ.రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకరరావు విజ్ఞప్తి చేశారు. గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లపాడు రైల్వే స్టేషన్ వద్ద సోమవారం నిర్వహించిన సమావేశంలో శంకరరావు మాట్లాడారు. కార్మికులకు ఏ ఇబ్బంది వచ్చినా మజ్దూర్ యూనియన్ మద్దతుగా నిలిచి సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం చేస్తుంటుందన్నారు. ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా లేకుండా అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య ఏర్పడి వందేళ్లు పూర్తయిందన్నారు. దీనికి అనుబంధంగా మజ్దూర్ యూనియన్ పని చేస్తుందన్నారు. డిసెంబరు 4 నుంచి 6వ తేదీ వరకు జరిగే ఎన్నికల్లో తమ సంఘానికి మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘ డివిజనల్ కార్యదర్శి ప్రసాద్, అధ్యక్షుడు మంజునాథ్, కోశాధికారి రవిశంకర్, హెడ్ క్వార్టర్స్ బ్రాంచి కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు శాస్త్రవేత్తలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతు శాస్త్రవేత్తలకు కలెక్టర్ బంగ్లారోడ్డులోని కృషి భవన్‌లో శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ అగ్రో ఎకోలాజికల్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ ఈడీ శామ్యూల్ ఆనంద్‌కుమార్ పాల్గొని రైతు శాస్త్రవేత్తలకు పలు అంశాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయం మధ్య తేడాలు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ఎటువంటి ఫలితాలను ఇస్తుందనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ థిమటిక్ లీడ్ సుధాకర్, ప్రకృతి వ్యవసాయం డీపీఎం రాజకుమారి, గుంటూరు, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాల నుంచి రైతు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్ కుమార్

రౌడీషీటర్ ప్రవీణ్ అరెస్టు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఒక వ్యక్తిపై దాడి చేసిన కేసులో నిందితుడైన రౌడీ షీటర్‌ను అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. శారదాకాలనీకి చెందిన ప్రసన్నకుమార్ అదే ప్రాంతంలో ఉన్న విజయసారథి బార్‌లో ఈనెల 19న మద్యం తాగుతుండగా రౌడీషీటర్ ప్రవీణ్ మద్యం మత్తులో అకారణంగా దాడి చేశాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ప్రవీణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

పోలవరం ఆర్‌ఎంసీ ఎస్‌ఈగా శ్యాం ప్రసాద్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు గేజింగ్ డివిజన్ ఈఈగా పని చేస్తున్న బి.శ్యాంప్రసాద్‌కు ప్రభుత్వం అడహక్ పదోన్నతి కల్పిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గేజింగ్ డివిజన్ ఈఈగా కొనసాగుతూనే పోలవరం కుడి ప్రధాన కాలువ సర్కిల్ ఎస్‌ఈగా అడహక్ పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది.

చదరంగంలో కేఎల్‌పీ విద్యార్థుల ప్రతిభ

నవభారత్‌నగర్, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో కేఎల్‌పీ విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో బి.ప్రదీప్, అండర్-17 లో పి.యశ్వంత్‌రాజ్‌కుమార్, అండర్-14 బాలికల విభాగంలో సీహెచ్.లక్ష్మీ చేతన ఎంపికయ్యారు. వీరితో పాటు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించి ధ్రువపత్రాలు, బహుమతులను ఆయన పాఠశాల ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కార్యదర్శి కృష్ణప్రసాద్ తదితరులు

ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల స్నేహ సంబంధాలతో మంచి ఫలితాలు


గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల మధ్య స్నేహ సంబంధాలతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతు నాయకుడు, మాజీ ఎంపీ యలమంచలి శివాజీని గుంటూరులోని నివాసంలో సోమవారం ఆయన కలిసి పరామర్శించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. 'రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య మంచి అవగాహన ఉంది. ముఖ్యమంత్రుల భేటీ తర్వాత అధికారులతో కమిటీ వేయాలని నిర్ణయించారు. ఈ కమిటీ ద్వారా ఇరు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుంది. భద్రాచలం ఎగువన ఉన్న ఐదు గ్రామాలను పరిపాలన దృష్ట్యా తెలంగాణలో కలపమని కోరుతున్నాం. ఇంకా కొలిక్కి రాని అంశాలుంటే.. చర్చల ద్వారా పరిష్కారమవుతాయి. గత వైకాపా ప్రభుత్వం తితిదేలో శ్రీవారి దర్శనం కోసం తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను రద్దు చేసింది. వీలైతే సిఫార్సు లేఖలను పునరుద్ధరించాలి. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విపరీతంగా ఉంది. పామాయిల్ వినియోగం దేశవ్యాప్తంగా పెరిగింది. ఉత్తరాంధ్రలో కూడా ఆయిల్‌పామ్ పంట కొంతమేరకు సాగు చేస్తున్నారు. ఆయిల్ వినియోగం పెరగడంతో పలు రకాల పంటల సాగు ప్రారంభించారు. ఆయిల్‌పామ్ పంటకు మద్దతు ధర రూ.20,000 ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశాం. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను ఆదుకోవాలని చూస్తున్నారు. రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇప్పటికే రూ.18,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం'.. అని వివరించారు.



యలమంచలి శివాజీని కలిసిన తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ముత్తంగి రూపంలో రాములోరి దర్శనం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి రూపంలో దర్శనమిచ్చారు. గుంటూరుకు చెందిన భాష్యం లక్ష్మీప్రసన్న, రామకృష్ణ దంపతులు రాములవారిని దర్శించుకుని మొక్కులో భాగంగా అన్నదానం నిమిత్తం రూ.లక్ష విరాళాన్ని ఈఓ రమాదేవికి అందించారు. వైదిక పెద్దలు ఆశీర్వచనం అందించారు.



ఈఓ రమాదేవికి రూ.లక్ష విరాళం అందిస్తున్న గుంటూరు భక్తులు

'హంతకులకు సజ్జల సహకారం'

పట్టాభిపురం, న్యూస్‌టుడే : జగన్ పాలనలో సకల శాఖ మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి దగ్గరుండి హంతకులను దేశం దాటించారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆరోపించారు. స్నేహితుడి దాడిలో తీవ్రంగా గాయపడి, ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతి మధిర సహనాను సోమవారం ఆయన కార్పొరేటర్ కొమ్మనేని కోటేశ్వరరావుతో కలిసి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా కనపర్తి మాట్లాడుతూ.. పుట్టినరోజు పేరుతో యువతిని రౌడీషీటర్ కారులో తీసుకువెళ్లి గాయపర్చడంతో ఆమె బ్రెయిన్ డెడ్ అయిందని చెప్పారు. ఆమెను బతికించేందుకు వైద్యులు విశ్వప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. నిందితుడు నవీన్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నట్లు వివరించారు. జగన్ హయాంలో.. ఆయన ఇంటికి కూతవేటు దూరంలోనే

దళిత యువతి రమ్యను హత్యచేశారని, వెంకటరెడ్డిని వైకాపా నేత సజ్జల దగ్గరుండి దేశం దాటించారని ఆరోపించారు. దళితుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసినా, అంబేడ్కర్ పేరును తొలగించి జగన్‌రెడ్డి పేరు పెట్టుకున్నా.. మాట్లాడలేని అసమర్థుడు మేరుగ నాగార్జున అని మండిపడ్డారు. ప్రేమికులు కొట్టుకున్నా, బంధువులు తన్నుకున్నా.. దానికి కారణం చంద్రబాబే.. అనే నీచ స్థాయికి వైకాపా నాయకులు దిగజారిపోయారని కనపర్తి ధ్వజమెత్తారు.

కారుణ్య నియామకాలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కారుణ్య నియామకంలో భాగంగా జిల్లాలో వివిధ పోస్టులకు ఎంపికైన ఐదుగురికి జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ సోమవారం కలెక్టరేట్‌లో నియామక ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు లక్ష్మీకుమారి, ఎం.గంగరాజు, డీఆర్‌వో పెద్ది రోజా పాల్గొన్నారు.

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రత్యేక డ్రైవ్ కింద దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులకు జరిగిన నియామకాల్లో పోస్టింగ్ పొందిన ముగ్గురికి జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ సోమవారం కలెక్టరేట్‌లో నియామక ఉత్తర్వులు అందించారు.

వచ్చే ఏడాది నుంచి 'పది'లో అంతర్గత మార్కులు

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిలోనూ అంతర్గత మార్కుల విధానాన్ని ప్రవేశపెట్టాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. సిలబస్ మార్పు చేసినందున పరీక్ష విధానంలోనూ మార్పులు తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుత ప్రభుత్వ, ప్రైవేటులోని అన్ని పాఠశాలలకూ జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) సిలబస్‌నే అమలు చేస్తున్నారు. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ చదువుతున్నా రాష్ట్ర బోర్డు పరీక్షలు రాస్తున్నారు. అయితే సీబీఎస్‌ఈ విధానంలో అంతర్గత మార్కుల విధానం ఉంది. గతంలో నిరంతర, సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానంలో అంతర్గత మార్కులు ఉండగా.. 2019లో వీటిని రద్దు చేశారు. అంతర్గత మార్కుల విషయంలో ప్రభుత్వ బడులు నిబంధనలను పాటిస్తున్నా.. ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా మార్కులు వేసుకుంటున్నాయని ఫిర్యాదులు రావడంతో ఆ విధానాన్ని రద్దు చేశారు. ఇప్పుడు 2025-26 విద్యా సంవత్సరం నుంచి పబ్లిక్ రాత పరీక్షకు 80 మార్కులు, అంతర్గతంగా 20 మార్కులు ఇచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పాఠశాలలు ఇష్టారాజ్యంగా మార్కులు వేసుకోకుండా పకడ్బందీ విధానాన్ని తీసుకొచ్చేలా ఆలోచన చేస్తున్నారు. సీబీఎస్‌ఈలో అంతర్గత మార్కులు 20కి 20 వేసుకోకుండా ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నారు. అలాంటి దాన్నే తీసుకురావాలని భావిస్తున్నారు. ప్రస్తుతం పదోతరగతి పరీక్షల్లో సూక్ష్మ, లఘు ప్రశ్నలు 12 ఉండగా.. వీటికి ఒక్కో దానికి అరమార్కు, తేలికైన 8 ప్రశ్నలకు ఒక్కో మార్కు ఉండగా.. వీటిని ఒక్కో మార్కు ప్రశ్నలుగా మార్పు చేయాలనే దానిపైనా కసరత్తు చేస్తున్నారు.

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కోర్టు సమన్లు

ఈనాడు, హైదరాబాద్: తిరుమల శ్రీవారి లడ్డూ అంశంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలపై తాను పిటిషన్ వేయగా సిటీ సివిల్ కోర్టు పవన్‌కు సమన్లు జారీ చేసిందని న్యాయవాది ఇమ్మనేని రామారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుమల లడ్డూ విషయంలో పవన్ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేశారని పిటిషనర్ పేర్కొన్నారు. అయోధ్యకు పంపిన లడ్డూల్లో కల్తీ జరిగిందని పవన్ మాట్లాడారని, ఆ వ్యాఖ్యలను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని రామారావు కోరారు.



దిల్లీలో ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేశ్

ఆంధ్రాలో పెట్టుబడులు పెట్టండి

- ఐసియా ప్రతినిధులకు మంత్రి లోకేశ్ ఆహ్వానం
- రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ ఏర్పాటు చేయండి
- కేంద్ర మంత్రి జయంత్ చౌదరికి వినతి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక విధానాన్ని అమల్లోకి తెచ్చి, అన్ని రకాల పరిశ్రమలకు అనువైన వాతావరణం నెలకొల్పుతున్నామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి సంస్థలను సాధించేందుకు సోమవారం ఆయన దిల్లీలో ఇండియన్ సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రతినిధులు, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌదరితో వేర్వేరుగా సమావేశమయ్యారు. తొలుత ఐసీఈఏ ఛైర్మన్ పంకజ్ మహీంద్ర అధ్యక్షతన జరిగిన సెల్యులర్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో పాల్గొని ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చడానికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. తాము ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశంలోని రాష్ట్రాలతో మాత్రమే కాకుండా దిగ్గజ దేశాలతో పోటీపడుతున్నట్లు తెలిపారు. 'పెరుగుతున్న పారిశ్రామికీకరణతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి పరిశ్రమల స్థాపనలో ఎదురవుతున్న విధానపరమైన సమస్యలను పరిష్కరిస్తున్నాం' అని చెప్పారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల కోసం అనువైన విధానాన్ని రూపొందించి ప్రోత్సాహకాలు అందించబోతున్నాం.. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. విశాఖపట్నాన్ని ఐటీ పవర్‌హౌస్‌గా, అంతర్జాతీయ ఏఐ రాజధానిగా తీర్చిదిద్దాలని, తిరుపతిని ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చాల్సిన లక్ష్యసాధనకు సహకరించాలని సెల్యులర్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ప్రతినిధులను కోరారు.



కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌదరితో మంత్రి లోకేశ్

ఏపీలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయండి

ఆంధ్రప్రదేశ్ యువత నైపుణ్యాభివృద్ధి కోసం అమరావతి, విశాఖపట్నంలలో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలు ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేశ్ కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌదరిని కోరారు. ఆయన సోమవారం దిల్లీలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలిసి జయంత్‌చౌదరితో సమావేశమయ్యారు. 'ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో అమరావతిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్, స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్లను నెలకొల్పండి. విశాఖపట్నంలో కేటాయించిన ఎకరాల్లో జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయండి. మంగళగిరిలో జెమ్స్ అండ్ జువెలరీ, అమరావతిలో నిర్మాణ రంగం, కర్నూలులో పునరుత్పాదక ఇంధనం, చేనేత-హస్తకళలు, విశాఖపట్నంలో ఫార్మా ల్యాబ్స్, నెల్లూరు, తిరుపతిలలో ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు చెందిన ఎక్సలెన్స్ సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర స్కిల్ కౌన్సిల్ నుంచి సహకారం అందించండి. గిరిజన ప్రభావిత ప్రాంతాల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు నిధులిప్పించండి' అని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు.. ఎదురు తిరిగితే దాడులు

- తండ్రి విశ్వరూప్ అధికారంతో రెచ్చిపోయిన శ్రీకాంత్
- దళిత యువకుడి హత్య కేసులో సూత్రధారిగా నిర్ధారణ



ఆదివారం రాత్రి మదురైలో పోలీసుల అదుపులో శ్రీకాంత్

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం, పి.గన్నవరం: అధికార బలంతో రెచ్చిపోయారు. తండ్రి మంత్రి పదవిని అడ్డం పెట్టుకొని ఇష్టారాజ్యంగా ప్రవర్తించారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారిని ఇబ్బంది పెట్టడం.. దూషణలకు పాల్పడేవారు. వైకాపా ప్రభుత్వ హయాంలో డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ వ్యవహారశైలి ఇది. 2022 జూన్ 6న జరిగిన అయినవిల్లికి చెందిన దళిత యువకుడు, వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో ప్రధాన సూత్రధారి శ్రీకాంత్‌ను తమిళనాడులోని మదురైలో ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతేడాది అంబేడ్కర్ జయంతి సందర్భంగా కొందరు ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తొలగించి అమలాపురంలో ర్యాలీ చేయగా, నాలుగు వాహనాలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. వాటిని తమ వారికి ఇచ్చేయాలని శ్రీకాంత్ డీఎస్పీ మాధవరెడ్డిని కోరారు. ధ్రువపత్రాలతో రావాలని చెప్పడంతో ఆగ్రహంతో వెళ్లిన శ్రీకాంత్ తండ్రి విశ్వరూప్‌తోపాటు అనుచరులను తీసుకొని స్టేషన్‌కు వచ్చారు. 'మీరు అన్‌నెససరీ చేస్తున్నారు.. చలో అమలాపురానికి పిలుపునివ్వమంటారా? ఇంతకు వందరెట్లు పోలీసులను తెచ్చుకున్నా సరిపోరు' అంటూ విశ్వరూప్ డీఎస్పీపై ఆగ్రహించారు. పోలీసుల అనుమతి లేకుండానే వాహనాలను పట్టుకుపోయారు. అమలాపురం మండలం కామనగరువులో గతేడాది ఆగస్టు 31న శ్రీకాంత్ 'గడప గడపకు' కార్యక్రమం నిర్వహించారు. కోనసీమ జిల్లా పేరు మార్పు విషయంలో తమను అన్యాయంగా కేసుల్లో ఇరికించారని పలువురు యువకులు ఆయన్ను నిలదీశారు. దీంతో ఆ ముగ్గురు యువకులను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి రాత్రయినా పంపలేదు. స్థానికుల ఆందోళనతో అర్ధరాత్రి విడిచిపెట్టి కేసులు పెట్టారు. తాను కాబోయే ఎమ్మెల్యేనంటూ శ్రీకాంత్ ప్రచారం చేసుకున్నారు. ఉద్యోగుల నియామకాలు, బదిలీల్లో సైతం జోక్యం చేసుకునే వారనే ఆరోపణలున్నాయి.

చట్టం తన పని తాను చేసుకుపోతుంది

- మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడి అరెస్టుపై మంత్రి సుభాష్



రామచంద్రపురం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లికి చెందిన వాలంటీరు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈ కేసులో మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేయడం వెనుక తన ప్రోద్బలం లేదని స్పష్టం చేశారు. విశ్వరూప్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఖండించారు. రామచంద్రపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'విశ్వరూప్ కుమారుడైన పినిపె శ్రీకాంత్‌కు దుర్గాప్రసాద్ ప్రధాన అనుచరుడు. ఆయన హత్య తర్వాత బాధిత కుటుంబానికి శ్రీకాంత్ రూ.లక్ష సాయం చేసి, హతుడి భార్యను ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లారు. రెండు ఎకరాల పొలం ఇస్తామని, కేసు పెట్టవద్దని విశ్వరూప్ బాధిత కుటుంబాన్ని బతిమిలాడారు. మృతుడి భార్య ఇద్దరు పిల్లలతో నా వద్దకు వచ్చారు. చట్టపరంగా న్యాయం చేస్తానని చెప్పి.. ఆమెను ఐజీ, డీఐజీల వద్దకు తీసుకెళ్లా. దుర్గాప్రసాద్‌ను ఫోన్ చేసి పిలిచి, చంపేశారని ఆయన భార్య చెబుతున్నారు. విచారణలో పూర్తి వాస్తవాలు తెలుస్తాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ కేసును ఎందుకు మూసేశారో చెప్పాలి. కోనసీమ అల్లర్లలో నేను ప్రధాన ముద్దాయినంటూ విశ్వరూప్ అసత్యాలు చెబుతున్నారు. ఆ కేసును వైకాపా ప్రభుత్వంలోనే కొట్టేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట ప్రకారం మేము కక్షపూరిత చర్యలకు పాల్పడబోము. న్యాయపరంగానే ముందుకెళ్తాం' అని వివరించారు.

అప్పట్లో ఈ కేసు దర్యాప్తు సక్రమంగా జరగలేదు: మంత్రి లోకేశ్

'రాష్ట్రంలో హింసను గత ప్రభుత్వం పెంచి పోషించింది. అందుకే ఈ హత్యకేసు దర్యాప్తు సక్రమంగా జరగలేదు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మృతుడి కుటుంబసభ్యులు ధైర్యం చేశారు. తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది' అని ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ వివరించారు.

రాష్ట్రాన్ని ముంచిన వైకాపా సర్కారు

- వారు చేసిన అప్పుపై ఏటా కట్టాల్సిన వడ్డీయే రూ.75 వేల కోట్లు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు రాష్ట్ర మంత్రి సత్యకుమార్ వివరణ



అమిత్ షాతో సమావేశమైన సత్యకుమార్ యాదవ్

ఈనాడు, దిల్లీ: రాష్ట్రాన్ని జగన్ రూ.11 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిపోయారని.. ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం వాటిపై వడ్డీల రూపంలోనే ఏటా రూ.75 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వివరించారు. జగన్ ప్రభుత్వం చేసిన పాపాలను కూటమి ప్రభుత్వం కడగాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అమిత్ షాతో సోమవారం ఆయన సుమారు 20 నిమిషాలపాటు సమావేశమయ్యారు. మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, మంత్రిగా తాను చేసిన పనులను తెలిపారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను పక్కదారి పట్టించి, యూసీలు కూడా ఇవ్వలేదని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం యూసీలను సకాలంలో కేంద్రానికి పంపుతున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల వినియోగంపై వివరాలు అందజేశారు. ఆయుష్మాన్‌భారత్ అమలు తీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పని విధానంపై అమిత్ షా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మచిలీపట్నం వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు

ఈనాడు డిజిటల్, అమరావతి: మచిలీపట్నంలోని నూతన ప్రభుత్వ వైద్య కళాశాలకు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పేరును ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రేపు గుంటూరు, వైఎస్సార్ జిల్లాల్లో జగన్ పర్యటన

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ బుధవారం గుంటూరు, వైఎస్సార్ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఒక రౌడీషీటర్ కారణంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి, గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువతిని పరామర్శించనున్నారు. తర్వాత వైఎస్సార్ జిల్లాకు చేరుకుని బద్వేలులో హత్యాచారానికి గురైన బాలిక కుటుంబంతో మాట్లాడతారు. అక్కడి నుంచి పులివెందులకు వెళతారని వైకాపా కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

మాటేసి దారి దోపిడీలు

- నగల వ్యాపారి సొమ్ము అపహరణ కేసు ఛేదన
- నిందితుడికి గతంలో ట్రాన్స్‌పోర్టులో పనిచేసిన అనుభవం
- మూడు రోజులు లారీ వెంటే ప్రయాణం

ఈనాడు, గుంటూరు

కమర్షియల్ టాక్స్ అధికారుల మాదిరి జాతీయ రహదారి పక్కన కారుతో మాటువేసి దారిదోపిడీలకు పాల్పడుతున్న ముఠాను బాపట్ల జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మేదరమెట్ల స్టేషన్ పరిధిలో ఇటీవల సరకు రవాణా చేసే వాహనంలో ప్రయాణిస్తున్న బంగారు నగల వ్యాపారి స్వరూప్‌ను కొట్టి అతని నుంచి రూ.39.50 లక్షలు అపహరించుకుపోయిన నలుగురు సభ్యుల ముఠాను 48 గంటల్లోపే పట్టుకోవటంతో కేసు చిక్కుముడి వీడింది. కేసును మేదరమెట్ల, అద్దంకి రూరల్ పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. వ్యాపారిని బెదిరించి పట్టుకుపోయిన నగదు మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. గూడ్స్ ట్రాన్సుపోర్టులో గతంలో పనిచేసిన ఓ ఉద్యోగి ఈ కేసులో సూత్రధారిగా గుర్తించారు. అతనికి సరకు లారీలో ప్రయాణించే వ్యాపారులపై పక్కా సమాచారం ఉందని ఆయనే ఈ దోపిడీకి వ్యూహం రచించారని పోలీసుల విచారణలో తేలింది. నిందితుల ముఠాను మంగళ, బుధవారంలో అరెస్టు చూపే అవకాశం ఉంది.

విజయవాడ నుంచి అనుసరిస్తూ..

గుంటూరుకు చెందిన నగల వ్యాపారి తరచూ చెన్నై వెళతారు. అక్కడ బంగారు నగలు కొనుగోలు చేసి గుంటూరుకు అదే ట్రాన్సుపోర్టులో వస్తారు. యథావిధిగానే వ్యాపారి స్వరూప్ బంగారు నగలు కొనుగోలుకు ఈనెల 18న రాత్రి గుంటూరులో లారీ ఎక్కారు. ఆ సరకు లారీ విజయవాడ నుంచి వస్తోంది. అక్కడి నుంచే ఆ ట్రాన్సుపోర్టులో పనిచేసిన మాజీ ఉద్యోగి మరో ఇద్దరితో కలిసి కారులో లారీని అనుసరిస్తున్నారు. గుంటూరులో ఈ వ్యాపారి ఎక్కగానే కొరిశపాడు ఫ్లైఓవర్‌కు సమీపంలో మాటువేసిన మరో ఇద్దరు సభ్యులకు ముందస్తు సమాచారమిచ్చి వారిని లారీ ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే రహదారికి అడ్డుగా నిలబడి తనిఖీ అధికారుల మాదిరి నటించేలా చేస్తారు. లారీ ఆగగానే వెనక నుంచి అనుసరిస్తున్న కారును ఒక్కసారిగా లారీ ముందుకు తెచ్చి అడ్డు పెడతారు.

లారీ డ్రైవర్‌ను, క్యాబిన్‌లో కూర్చొన్న వ్యాపారిని కిందకు దిగాలని తాము కమర్షియల్ టాక్సు అధికారులమని బిల్లులు చూపాలని కోరారు. కిందకు దిగగానే వ్యాపారిని పథకం ప్రకారం పి.గుడిపాడు వైపు కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి అక్కడ బెదిరించి బ్యాగ్‌తో సహా నగదు తీసుకుని విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని హెచ్చరించి తిరిగి లారీ వద్దకు తెచ్చి వదిలేశారు. అప్పటి దాకా లారీని అక్కడే నిలిపి డ్రైవర్‌కు ఇద్దరు వ్యక్తులు కాపలా ఉంటారు. వ్యాపారిని తీసుకురాగానే అంతా కలిసి కారులో వెళ్లిపోతారు.

స్థానికుల సమాచారం.. పట్టించిన కారు నంబరు

లారీని ఆపి కారులో వ్యాపారిని ఎక్కించుకుని వెళుతున్న ఉదంతాన్ని స్థానికుడు ఒకరు చూశారు. వ్యాపారి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకుని అక్కడి వారిని విచారించి ఆ ప్రాంతంలో సీసీ ఫుటేజీలు తీసి కారును గుర్తించారు. కారుపై నంబరు ఆధారంగా ఈ మొత్తం అపహరణకు సూత్రధారులు, పాత్రధారులు దొరికిపోయారు. కారు నంబరు లభించగానే దాని నిర్వాహకుడి ఫోన్ టవర్ లొకేషన్ తీసుకుని వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవటంతో కేసు చిక్కుముడి వీడింది.

లారీ వెంట మూడు రోజులు రెక్కీ

ఈ ముఠా మూడు రోజుల పాటు లారీని అనుసరించింది. రెండురోజులు విజయవాడ నుంచి బొల్లాపల్లి టోల్‌ప్లాజా వరకు వచ్చే వరకు ఎవరూ ఎక్కలేదని తెలుసుకుని నిరాశతో వెళ్లిపోయారు. మూడో రోజు విజయవాడ నుంచి లారీని అనుసరించారు. ఆ రోజు గుంటూరులో స్వరూప్ అనే నగలు వ్యాపారి ఎక్కటం ఆయన గతంలో కూడా అదే వాహనంలో పలుమార్లు చెన్నైకు వెళ్లారని కచ్చితంగా ఆయన వద్ద డబ్బులు ఉంటాయని భావించి పక్కా ప్రణాళికతో వ్యవహరించారు. చివరకు పోలీసులకు చిక్కారు. నిందితులు మేదరమెట్ల, కొరిశపాడు, ఒంగోలుకు చెందిన వారిగా తెలిసింది.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. స్థానిక నగరంపాలెం స్తూపం వద్ద సోమవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రతలో పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరిస్తూ ఇక మీదట ఎవరు అమరవీరులు కాకుండా చూడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజంలో ఉగ్రవాదం, అసాంఘికశక్తులను అణచివేసే క్రమంలో ప్రాణత్యాగాలు చేస్తున్న పోలీసులు చిరస్మరణీయులని పేర్కొన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ పోలీసు కొలువు ప్రతి రోజు సవాల్‌తో కూడుకుందని వెల్లడించారు. ఈ సందర్భంగా పోలీసులు తుపాకులను కిందకు దించి అమరవీరులకు నివాళులర్పించగా అతిథులు, అధికారులు రెండు నిమిషాలు మౌనంపాటించారు. అమరవీరుల స్తూపంవద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సుప్రజ, రమణమూర్తి, హనుమంతు, కమాండెంట్ చంద్రబాబు, డీఎస్పీలు జయరాంప్రసాద్, అజీజ్, సీతారామయ్య, రమేష్, సుబ్బారావు, మల్లికార్జునరావు, శాంతకుమార్, సీఐలు, ఆర్ఐలు, విశ్రాంత పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.



స్తూపం వద్ద అమరవీరులకు అధికారుల నివాళి..



తపాకులను కిందకు దించి నివాళులు అర్పిస్తూ..

విద్యార్థినుల వసతిగృహ నిర్మాణానికి రూ.1.25 కోట్ల విరాళం



విరాళం చెక్కును కోటేశ్వరరావు, రమేష్‌లకు అందజేస్తున్న ప్రవాసాంధ్రుడు రామకృష్ణ ప్రసాద్

గుంటూరు (పట్టాభిపురం), న్యూస్‌టుడే: గుంటూరులో కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్న గ్రామీణ ప్రాంత విద్యార్థినుల వసతి గృహ నిర్మాణానికి ప్రవాసాంధ్రుడు నూతక్కి రామకృష్ణ ప్రసాద్ రూ.1.25 కోట్ల విరాళం ఇచ్చారు. దీనికి సంబంధించిన చెక్కును ఆయన సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లకు గుంటూరులో సోమవారం అందజేశారు. కోటేశ్వరరావు, రమేష్‌లు మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడిన ప్రముఖ పారిశ్రామికవేత్త నూతక్కి రామకృష్ణ ప్రసాద్ విద్యార్థినుల వసతి గృహ నిర్మాణానికి రూ.25 కోట్లు విరాళంగా సమకూరుస్తామని చెప్పి ఇప్పటి వరకు రూ.8 కోట్లు ఇచ్చారన్నారు. రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి 2000 మంది విద్యార్థినులకు వసతి కల్పించాలని సూచించారు.

పొగాకు రైతులకు రూ.6,313.58 కోట్ల ఆదాయం

గుంటూరు(జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పొగాకు రైతులకు 2023-24 ఆర్థిక ఏడాదిలో రూ.6,313.58 కోట్ల ఆదాయం లభించిందని భారత పొగాకు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, కార్యనిర్వాహక సంచాలకుడు (ఈడీ) అద్దంకి శ్రీధర్‌బాబు తెలిపారు. గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయంగా భారతీయ ఎఫ్‌సీవీ పొగాకుకు డిమాండ్ పెరగడంతో రైతులు అధిక ధర పొందారన్నారు. 215.35 మిలియన్ కిలోల నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయడంతో రికార్డు స్థాయిలో సగటున కిలోకి రూ.288.65 ధర లభించిందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నాణ్యమైన పొగాకును కిలో రూ.411కు కొనుగోలు చేశారన్నారు. ఎఫ్‌సీవీ పొగాకు చూర, ముక్క 9.46 మిలియన్ కిలోలను కూడా రైతులు విక్రయించారన్నారు. రాష్ట్రంలోని 16 వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు ఫిబ్రవరి 29న ప్రారంభమై అక్టోబరు 14న ముగిశాయన్నారు. గతంలో గరిష్ఠ ధర కిలో రూ.289 పలకగా.. ఈ ఏడాదిలో రూ.411 లభించిందన్నారు. పొగాకు ఎగుమతులు 2023-24లో రికార్డు స్థాయిలో రూ.12,005.89 కోట్లకు చేరుకున్నాయని, 2024-25లో సెప్టెంబర్ నాటికి ఎగుమతుల విలువ రూ.829.58 కోట్లని చెప్పారు. గత ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించడంతో ప్రజలను ఆదుకోవడానికి పొగాకు బోర్డు ఉద్యోగులతో పాటు రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రూ.92.70 లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు. ఏపీ సీఎం సహాయ నిధికి రూ.89,52,452, తెలంగాణ సీఎం సహాయ నిధికి రూ.3,17,741 ఇద్దరు సీఎంలను కలిసి అందజేస్తామని నమూనా చెక్కులు చూపారు. సమావేశంలో పొగాకు బోర్డు కార్యదర్శి డి.వేణుగోపాల్, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రూ.25 వేల కోట్లతో రైల్వే లైన్ల ఆధునికీకరణ



కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే రామాంజనేయులుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రూ.25 వేల కోట్లతో రైల్వే లైన్లను ఆధునికీకరణ చేస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. అమరావతి రాజధానికి రోడ్లతో పాటు ప్రత్యేక రైల్వే లైన్ తీసుకువస్తున్నట్లు తెలిపారు. పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్తిపాడులో ఆయన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి పర్యటించారు. రూ.12 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల గ్రాంటు రాబట్టుకున్నామని చెప్పారు. చదువుకున్న వారు ఎవ్వరైనా ఉంటే సంబంధిత వెబ్‌సైట్లోకి వెళ్లి చూస్తే కేంద్రం ఇచ్చింది రుణమా..? గ్రాంటా..? అనేది తెలుస్తుందన్నారు. నగరాల్లో రైల్వేస్టేషన్లను రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామన్నారు.

20 నెలలుగా జీతాల్లేవ్.. మా మొర ఆలకించండి

పవన్‌ను కలిశాకే వెళ్తామని పొరుగు సేవల ఉద్యోగుల ఆవేదన



మంగళగిరిలోని జనసేన కార్యాలయం వద్ద పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు వచ్చిన పొరుగుసేవల ఉద్యోగులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్యశాఖ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, ఫార్మసీ కౌన్సిల్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న పొరుగుసేవల ఉద్యోగులు పెద్దఎత్తున సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో తమను ఆయా విభాగాల్లో నియమించుకుని 20 నెలలుగా జీతం కూడా చెల్లించలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని చిరుద్యోగులమని, తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. రాష్ట్రం నలుమూలల నుంచి సంబంధిత ఉద్యోగులు పిల్లా పాపలతో వచ్చి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు యత్నించారు. ఆ సమయంలో పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు వారిని లోపలికి పిలిచి మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. గత ప్రభుత్వం వారిని ఎలా నియామకం చేసింది? వారు చేసిన కాలానికి జీతం ఎందుకు ఇవ్వలేదు? ఎక్కడ పెండింగ్ పడ్డాయో తాము వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను సంప్రదించి మీ సమస్యకు పరిష్కారం చూపుతామని చెప్పినా వారు ససేమిరా అన్నారు. ఎంత సేపయినా ఇక్కడే ఉంటామని, పవన్‌ను కలిసి తమ సమస్యను చెప్పుకున్నాకే ఇక్కడి నుంచి తాము వెళతామని రాత్రి 10 గంటల తర్వాత కూడా వారు పార్టీ కార్యాలయం వద్దే ఉన్నారు. ఈ క్రమంలో కొందరు సొమ్మసిల్లి పడిపోయారు. తమ సమస్యకు పరిష్కారం పవన్‌తోనే సాధ్యమని ఉద్యోగుల తరఫున నాయకత్వం వహించిన రామకృష్ణ, మహేష్, రవితేజ తదితరులు పేర్కొన్నారు.

28న అగ్రిగోల్డ్ బాధితుల మహా విజ్ఞాపన దీక్ష

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న మహా విజ్ఞాపన దీక్ష చేపడుతున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఉప ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం వారు దాసరిభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అగ్రిగోల్డ్ కంపెనీ చేసిన మోసానికి, లక్షలాది మంది కుటుంబాల కష్టానికి పదేళ్లు నిండాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైకాపా ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని మోసం చేసిందన్నారు. ఈ సమస్యపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 28న తలపెట్టిన కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి బాధితులు తరలిరావాలని పిలుపునిచ్చారు.